ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

## ఆషాఢ బోనాలకు భారీగా ఏర్పాట్లు

భక్తులకు ఇబ్బంది లేకుండా భద్రతా చర్యలు

➢ 2వ పేజిలో..

నగర పోలీస్ అధికారులతో సజ్జనార్ సమీక్ష

WEDNUSDAY 15TH JULY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 119 COST : 3\- KHAMMAM, TELANGANA

బుధవారం 15 జూలై 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :119 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI




## ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి**

హైదరాబాద్,జూలై14 ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా అందజేసిన ఎన్యూరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బిఎల్ఒలకు వెంటనే అందజేసి మీ యొక్క అమూల్యమైన ఓటుహక్కును కాపాడుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బిఎల్ఒలు అందజేసిన ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా పూరించి, ఫోటోలను అతికించి బిఎల్ఒలకు అందించాలని సిఇఒ కోరారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పనిసరిగా ఓటర్ సంతకం, తేదీతో పాటు బిఎల్ఒల సంతకం ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిఎల్ఒలు ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకటి బిఎల్ఒలకు ఇవ్వాలని, మరొకటి ఓటర్ భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను

➢ మిగతా 2వ పేజిలో..

## సరిహద్దుల్లో అమెరికన్ మాజీ సోల్జర్ అరెస్ట్

- అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా పట్టివేత
- పొంతన లేని సమాధానాలు చెప్పడంపై అనుమానాలు

న్యూఢిల్లీ,జూలై14:భారత్-నేపాల్ సరిహద్దులో సశస్త్ర సీమా బల్ మరో అమెరికన్‌ను అదుపులోకి తీసుకుంది. అమెరికా డ్రోన్ నిపుణుడు మాథ్యూ వాన్‌డైక్‌ను ఇటీవల మణిపుర్‌లోభారత సైన్యం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న అమెరికా మాజీ సైనికుడిని ఎస్ఎస్‌బి అదుపులోకి తీసుకుంది. అతడిని కాలిఫోర్నియాకు చెందిన జోర్డాన్ బ్రౌన్‌గా గుర్తించారు. సరైన ప్రయాణ పత్రాలు లేకుండా నేపాల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా అతడిని ఎస్ఎస్‌బి జవాన్ అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. జవాన్ నుంచి తప్పించుకొని పారిపోతుండగా.. స్థానికులు పట్టుకొని భద్రతా సిబ్బందికి అప్పగించారన్నారు. విచారణ సమయంలో బ్రౌన్ పొంతన లేని సమాధానాలు చెప్తున్నాడని అధికారులు తెలిపారు. బ్రౌన్ 2025 నవంబర్‌లో సముద్ర మార్గం ద్వారా భారత్‌లోకి ప్రవేశించి.. అప్పటి నుంచి గోవాలో నివసిస్తున్నట్లు గుర్తించామన్నారు. సరైన పత్రాలు లేకుండా భారత్‌లోకి ప్రవేశించినందుకు ఇమిగ్రేషన్ అధికారులు అతడిపై కేసు నమోదు చేశారు. విచారణలో అతడు బెంగళూరు, లఖ్‌నవూ, గోరఖ్‌పూర్‌లకు వెళ్లినట్లు తేలిందన్నారు. తాను కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని.. ఆరేళ్లపాటు అమెరికా సైన్యంలో పని చేశానని బ్రౌన్ వెల్లడించారు. రెండేళ్ల క్రితం సైన్యం నుంచి వైదొలిగానన్నారు. మూడేళ్ల క్రితం తాను ఇటలీ పర్యటనలో ఉన్న సమయంలో ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక భారతీయ మహిళను కలిశానని.. 2024 అక్టోబర్‌లో

➢ మిగతా 2వ పేజిలో..



## నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా

- రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాలు
- ఎర్రవల్లి వద్ద రూ.155 కోట్లతో ఉప కేంద్రం నిర్మాణం
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

మహబూబ్‌నగర్,జూలై14 నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిధులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,

➢ మిగతా 2వ పేజిలో..

## ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి..

- ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు
- రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



న్యూఢిల్లీ,జూలై14: రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూ సేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆర్ఆర్ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుందుని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి

➢ మిగతా 2వ పేజిలో..

## ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధి

- ఆస్పత్రుల్లో అభివృద్ధికి కొత్త పాలసీతో ముందుకు వెలుతున్నాం
- ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు
- భద్రాద్రని కొత్తగూడెం జిల్లా ప్రతినిధులతో మంత్రి దామోదర సమీక్ష



హైదరాబాద్,జూలై14 భద్రాద్రి కొత్తగూడెం సహా, రాష్ట్రంలోని అన్ని ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీని తీసుకొస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఐటీడీఏల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో, దశలవారీగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో జనాభా

➢ మిగతా 2వ పేజిలో..

## ఊరూరా బిఆర్ఎస్ కుట్రలపై ప్రచారం

- కెసిఆర్ హాయంలోనే కూలిన కాళేశ్వరం
- కేంద్ర నిపుణలు సూచనల మేరకు నీటి విడుదల
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదరాబాద్,జూలై14 కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. కాళేశ్వరం కూలడానికి కారణం బీఆర్ఎస్ అని ఆరోపించారు. ఊరూరా తిరిగి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు.

మంగళవారం మీడియా తో మాట్లాడుతూ.. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే.. వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజినీర్లు ఇచ్చిన సలహాలను పాటిస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగంలోకి రావాలంటే ఏం చేయాలో నిపుణులు చెబితే వెంటనే అమలు చేస్తామని

➢ మిగతా 2వ పేజిలో..

## ఇంధన భద్రత లక్ష్యంగా జైశంకర్ గల్ఫ్ పర్యటన

**వివరాలు వెల్లడించిన విదేశాంగ శాఖ**

న్యూఢిల్లీ,జూలై14: భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల గల్ఫ్ ప్రాంతంలోని నాలుగు దేశాలలో జరిపిన పర్యటనలో 'ఇంధన భద్రత' అత్యంత కీలకమైన అంశంగా నిలిచిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో పాటు పశ్చిమాసియాలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలపై కూడా విస్తృత చర్చలు జరిగాయని పేర్కొంది. మంగళవారం ఢిల్లీలో జరిగిన వారంతపు మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికారిక ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ పర్యటనలకు సంబంధించిన వివరాలను పంచుకున్నారు. ఈ నెల ప్రారంభంలో విదేశాంగ మంత్రి ఖతార్, కువైట్, బహ్రెయిన్, ఒమన్ దేశాలలో పర్యటించి, ఆయా దేశాల అగ్రనాయకత్వంతో, తన సహచర మంత్రులతో విస్తృతస్థాయి చర్చలు జరిపారని వెల్లడించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో, భారత విదేశాంగ మంత్రి గల్ఫ్ దేశాల పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది.. భారతదేశ ఆర్థిక ప్రగతికి అత్యంత కీలకమైన చమురు, గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవడానికి, అంటే 'ఇంధన భద్రత'ను కాపాడుకోవడానికి ఈ పర్యటన ఎంతగానో దోహదపడుతుందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

➢ మిగతా 2వ పేజిలో..

## ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్

- నేడు శంకుస్థాపన చేయనున్న సిఎం
- దీవిటిపల్లిలో అమర్ రాజా బ్యాటరీ సెంటర్ ప్రారంభోత్సవం

హైదరాబాద్,జూలై14 తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో పర్యటించి పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు సీఎం రేవంత్ భూమిపూజ చేయనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమరరాజా సెల్ తయారీ

➢ మిగతా 2వ పేజిలో..

# ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి..

చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్ధరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ దితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా

ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్చాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకొని అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ.155 కోట్ల నిధులతో 220/ 132/33 కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాస రావు, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, డిఈ రవి ప్రసాద్, ఇతర ప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, పాల్గొన్నారు.

## ఊరూరా బిఆర్ఎస్ కుట్రలపై ప్రచారం

మంత్రి వెల్లడించారు. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని చెప్పారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్నామ్యాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని.. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్

యూనిట్‌ను ప్రారంభించనున్నారు. అలాగే వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల ఉన్నత పాఠశాల భవనం ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీకి బయలుదేరుతారు. 12:15 గంటలకు ఫ్యూచర్ సిటీలోని అమెజాన్ డేటా సెంటర్ వేదికకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12:15 నుంచి 12:45 గంటల మధ్య అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ చేస్తారు. అనంతరం 12:50 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లికి పయనమవుతారు. మధ్యాహ్నం 1:15 గంటలకు దివిటిపల్లి చేరుకుని, 1:20 నుంచి 2:20 గంటల మధ్య అమరరాజా సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవం, ప్లాంట్ సందర్శన, అనంతరం ప్రసంగం చేయనున్నారు. ధ్యాహ్నం 2:20 గంటలకు దివిటిపల్లి నుంచి వనపర్తి జిల్లా కొత్తకోటకు హెలికాప్టర్‌లో సీఎం రేవంత్ బయలుదేరుతారు. మధ్యాహ్నం 2:40 గంటలకు కొత్తకోటకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2:45 నుంచి 3:45 గంటల మధ్య బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం 3:45 గంటలకు కొత్తకోట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు

# ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

బిఎల్ఒలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో ఓటర్ వివరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా నింపాలని, ఒకవేళ అటువంటి వివరాలను లేకపోయిన ప్రస్తుత వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బిఎల్ఒలకు అందజేయాలన్నారు. రాష్ట్రంలోని మొత్తం3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610 మంది

ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సమర్పించారు. సర్ పక్రియ జూన్ 25 నాడు ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ఈ పక్రియ ముగుస్తుందని, ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే బిఎల్ఒలకు అందజేయాలని సూచించారు.

# నగరంలో మరోసారి ఏసీబీ సోదాల కలకలం

హైదరాబాద్,జూలై14 హైదరాబాద్ నగరంలో మరోసారి ఏసీబీ సోదాల కలకలం రేగింది. హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ ఇల్లు, కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి సోదాలు కొనసాగాయి. బచ్చు రవీందర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయిన నేపథ్యంలో ఏసీబీ దాడులు నిర్వహిస్తోంది. అక్రమంగా ఆస్తులను కూడబెట్టినట్టు చీఫ్ ఇంజినీర్‌పై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఏకకాలంలో 12 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలకు దిగారు. ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో సోదాలు కొనసాగాయి. ఇప్పటికే రవీందర్ నివాసంలో పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆస్తుల పత్రాలతోపాటు, వివిధ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను అధికారులు గుర్తించారు. రవీందర్ నివాసంలో బ్యాంకు లాకర్లను గుర్తించినట్లు సమాచారం. ఈరోజు సాయంత్రం వరకు సోదాలు కొనసాగాయని తెలుస్తోంది. హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ నివాసంలో సోదాలు ముగిశాయని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ వెల్లడించారు. ఈ సోదాల్లో అతని వద్ద ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులు భారీగా గుర్తించినట్లు తెలిపారు. సోదాల అనంతరం ఆయన మాట్లాడారు. సుమధుర అక్రోపోలిస్‌లో 3 ప్లాట్, శ్రీవారి మెడోస్‌లో మరో ప్లాట్ ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వాసవి అట్లాంటిస్‌లో ఏకంగా మూడు ప్లాట్లు కొనుగోలు చేసినట్లు కనుగొన్నామని చెప్పారు. మసీద్ బండలో నాలుగు అంతస్తుల భారీ భవనం, జడ్చర్లలో 7 ప్లాట్లు, కొండాపూర్‌లో రెండు ప్లాట్లు ఉన్నాయని వివరించారు. శంషాబాద్, షాబాద్ పరిధిలో 4 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు తమకు ఆధారాలు లభ్యమయ్యాయని పేర్కొన్నారు. సోదాల్లో అర కిలో బంగారం, వెండి వస్తువులతో పాటు రూ.10 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ సీజ్ చేశామని అన్నారు. అలాగే బచ్చు రవీందర్ పేరిట ఉన్న 4 బ్యాంక్ లాకర్లను గుర్తించి.. వాటిని ఫ్రీజ్ చేసినట్లు స్పష్టం చేశారు. ఆస్తులతో పాటు ఇంట్లో నిబంధనలకు విరుద్ధంగా దాచి ఉంచిన 18 విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ వెల్లడించారు.

# సరిహద్దుల్లో అమెరికన్ మాజీ సోల్జర్ అరెస్ట్

ఆమెను వివాహం చేసుకున్నానని తెలిపారు. అనంతరం టూరిస్ట్ వీసాపై థాయ్‌లాండ్ వెళ్లానని.. అక్కడ పాస్‌పోర్టు పోవడంతో తాను సముద్ర మార్గంలో భారత్‌కు వచ్చినట్లు వెల్లడించారు. గోవాలో పరిచయమైన ఓ నేపాల్ వ్యక్తిని కలవడానికి ఆ దేశానికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ గురించి ప్రశ్నించగా బెంగళూరులోని ఓ పరిచయస్థుడి వద్ద ఉందని చెప్పారు. కొన్నాళ్ల క్రితం కోల్‌కతాలో అరెస్టైన మాథ్యూ వాన్‌డైక్ బృందం ఐరోపా నుంచి తెచ్చిన డ్రోన్లను ఈశాన్య భారతం గుండా మయన్మార్‌లోని తిరుగుబాటుదారుల గ్రూపులకు అందించినట్లు సమాచారం. ఇలా డ్రోన్లను దొంగ రవాణా చేయడం, వాటి కూర్పు, మరమ్మతులు, ఎలక్ట్రానిక్ యుద్ధరీతులలో మయన్మార్ తిరుగుబాటుదారులకు శిక్షణ ఇవ్వడం వాన్‌డైక్ బృందం పని అని నాడు రష్యా వెల్లడించింది. విదేశీయులు మిజోరంలో ప్రయాణించాలంటే రక్షిత ప్రాంత పర్మిట్ (పీఏపీ) తప్పనిసరి. కానీ, నిందితులు అలాంటి అధికార అనుమతులు లేకుండానే ఈశాన్య భారతం నుంచి మయన్మార్‌లోకి ప్రవేశించారనేది ఆరోపణ.వాన్‌డైక్ అరెస్టు ఒక కొత్త ధోరణిని సూచిస్తోంది. విదేశీ కిరాయి సైనికులు భారత భూభాగం గుండా ఇతరులకు ఆయుధాలు, డ్రోన్ల బట్వాడాకు నడుంకట్టారు. వారు భారత్‌ను కీలకమైన రవాణా మార్గంగా వాడుకోవాలని చూస్తున్నారు. వాన్‌డైక్ 'సన్స్ ఆఫ్ లిబర్టీ ఇంటర్నేషనల్' అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు. లిబియా అంతర్యుద్ధ సమయంలో గడాఫీకి వ్యతిరేకంగా పోరాడటం ద్వారా వార్తల్లోకి వచ్చాడు. మోటార్ సైకిల్‌పై ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లో పర్యటించాడు. సిరియా అంతర్యుద్ధంలోనూ పాల్గొన్నాడు. 2022 మార్చి నుంచి అతని సంస్థ ఉక్రెయిన్‌లో రష్యాకు వ్యతిరేకంగా పనిచేస్తోంది.

# ఆషాఢ బోనాలకు భారీగా ఏర్పాట్లు

**భక్తులకు ఇబ్బంది లేకుండా భద్రతా చర్యలు**

**నగర పోలీస్ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష**



హైదరాబాద్,జూలై14 ఆషాడ బోనాల ఉత్సవాలు శాంతియుతంగా, వైభవంగా నిర్వహించడమే లక్ష్యమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ బోనాలు.. మొదటి 15 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం బంజారా హిల్స్‌లోని టీజీఐసీసీసీలో ఆషాడ బోనాలపై ఆ శాఖ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష నిర్వహించారు. ఈ బోనాలకు పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జూలై 16 నుంచి ఆగస్టు13వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ ఆలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్‌డ్, రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీమ్స్ భారీగా మోహరిస్తున్నట్లు వివరించారు. భక్తులకు సమాచారం కోసం ఆలయాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వివరించారు. మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని.. అందుకోసం షీ టీమ్స్‌తో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని

తెలిపారు. ఈవ్ టీజింగ్, గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబుదొంగలపై ఉక్కుపాదం మోపనున్నట్లు చెప్పారు. గత బోనాల్లో 644 మంది ఆకతాయిలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఆయన గుర్తు చేశారు. బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపులకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని నగర సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధి

ప్రాతిపదికన కాకుండా, ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా దూరాన్ని బట్టి హాస్పిటళ్లను అభివృద్ధి చేస్తామని, అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను మంజూరు చేస్తామన్నారు. అవసరాన్ని బట్టి ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లలను అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సెక్రటేరియట్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనుకయ్య, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఈ రెండున్నర సంవత్సరాల్లో జిల్లాలోని ప్రభుత్వ దవాఖాన్లలో వైద్య సేవలు గణనీయంగా మెరుగయ్యా యన్నారు. జిల్లాలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారని, హాస్పిటళ్లలో అన్నిరకాల మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ అవేర్‌నెస్ కార్యక్రమాలు కూడా చేపడుతోందన్నారు. కొత్తగూడెం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంత్రిని కోరారు. ఎంసీహెచ్, జీజీహెచ్ నడుమ డిస్టన్స్ ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో ఎంసీహెచ్‌కు ప్రత్యేకంగా ఒక ఇంచార్జ్ సూపరింటెండెంట్‌ను నియమించాలన్నారు. కొంత మంది డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కూనంనేని కోరారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్, కొత్తగా 4 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేసినందుకుగానూ ఎమ్మెల్యేలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్స్‌లను మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. కొత్తగూడెం జిల్లాల్లోని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను

అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీలలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వాటిని అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. టీచింగ్ హాస్పిటల్, జిల్లా హాస్పిటల్, ఏరియా హాస్పిటళ్లు, సీహెచ్‌సీలలో జనరేటర్లు ఇటీవలే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, తమది అటవీ ప్రాంతం అయినందున వర్షాల సమయంలో పవర్ కట్ సమస్య ఉంటుందని, ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని పీహెచ్‌సీలలోనూ జనరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి దామోదర మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అత్యంత మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అడవులు, కొండలు, దూర ప్రాంతాలు, రవాణా సమస్యలు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అడ్డంకులు కాకూడదు అన్నారు. ఈ నేపథ్యంలోనే గత నెలలోనే ఐటీడీఏ పీవోలతో సమావేశం నిర్వహించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. వర్షాకాలంలో గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. కొత్తగూడెం జిల్లాలోని ప్రతి మండలానికి ఒక అంబులెన్స్ మంజూరు చేశామన్నారు. సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్స్‌లను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. జిల్లాలో ఇప్పటికే 7 డయాలసిస్ సెంటర్లు ఉండగా, కొత్తగా మరో 4 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. కేవలం 20 నిమిషాల ప్రయాణంతో పేషెంట్ డయాలసిస్ సెంటర్‌కు చేరుకునేలా డయాలసిస్ నెట్‌వర్క్‌ను విస్తరించామని తెలిపారు. భద్రాచలం, అశ్వారావుపేట, ఎల్లందు సహా ఏజెన్సీ ప్రాంతాల్లోని అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ సేవలను దశలవారీగా అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి హామి ఇచ్చారు. ఎమ్మెల్యేలు కోరినట్టుగా కొత్తగూడెం సహా అటవీ ప్రాంతాల్లో ఉన్న అన్ని పీహెచ్‌సీల్లో జనరేటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పట్వారిగూడెం, అన్నపెరటిపల్లి పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేస్తామని, గండుగులపల్లిలో కొత్త సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని మంత్రి హామి ఇచ్చారు. కొమురారం హాస్పిటల్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, ఎల్లందు హాస్పిటల్‌లో కొత్త ఐసీయూను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిలో ఎవరికైనా భద్రాచలం, అశ్వారావుపేట వంటి అటవీ ప్రాంతాల్లో పనిచేసేందుకు ఆసక్తి ఉంటే.. వారికి ఆయా హాస్పిటళ్లలోనే పోస్టింగ్స్ ఇవ్వాలని ప్రిన్సిపల్ సెక్రటరీకి మంత్రి సూచించారు. అదే సమయంలో, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే డాక్టర్లు, సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని హెల్త్ సెక్రటరీనిని మంత్రి ఆదేశించారు. కొత్తగూడెం ఎంసీహెచ్‌లో డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్‌ను మానిటర్ చేసేందుకు ఒక డాక్టర్‌ను ప్రత్యేకంగా నియమించాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా హాస్పిటల్స్‌లో డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్ మానిటరింగ్ కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యేలకు మంత్రి వివరించారు. ఎమ్మెల్యేలు రెగ్యులర్‌గా హాస్పిటల్స్‌ను విజిట్ చేయాలని మంత్రి సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్తగూడెం జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. అన్నిరకాల మెడిసిన్, డయాగ్నస్టిక్ కిట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అవసరమైన వైద్య పరికరాలు ప్రతి హాస్పిటల్‌లో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు అందించాలని సూచించారు. 108, 102 అంబులెన్స్ సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు, వరదల వల్ల రోడ్డు కనె÷-టకెవిటీ దెబ్బతినే ప్రమాదం ఉంటుంది కాబట్టి, డెలివరీ డేట్ దగ్గర పడిన గర్భిణులను హాస్పిటల్స్‌లోని బర్త్ వెయిటింగ్ హాల్స్‌కు తరలించాలని, అక్కడ వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి సూచించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యం పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయలు విడుదల చేయమంటే అక్రమ అరెస్టులా

- అక్రమ అరెస్టులతో పేద విద్యార్థిల కోసం చేసే ఉద్యమాన్ని అణచివేయలేరు - ఏఐఎస్ఎఫ్
- విద్యార్థి ఉద్యమాలపై అక్రమ అరెస్టును ప్రభుత్వం వెంటనే విరమించాలి.
- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,జూలూరుపాడు/ జులై 14/అక్షరం న్యూస్: పేద విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి బయలుదేరి వెళ్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీని మరియు ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అనిల్ కుమార్, అఖిల్ బాలాజీ లను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయమని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విడుదల కోసం పోరాటం చేసే ఉద్యమాన్ని ఎవరు అణిచివేయలేరు అని అన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజ్ బకాయిలు విడుదల మరియు విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని అక్రమ అరెస్టు చేసిన ఎన్ని చేసినా ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే ఉంటామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

## నేటి నుంచి కాంగ్రెస్ గ్రామ నూతన కమిటీల ఎన్నిక



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూలై 14: మండలంలోని కాంగ్రెస్ గ్రామ నూతన కమిటీల ఎన్నిక కోసం ఈ నెల 15 నుంచి గ్రామాల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె మహేందర్ రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న ఉదయం 10 గంటలకు శ్రీమన్నాయణపురం, వ ధ్యాహ్నం 12 గంటలకు ఎల్లారెడ్డిగూడెం, 17న ఉదయం 10 గంటలకు రఘునాథపల్లి, 18న ఉదయం 10 గంటలకు రామ రాయని బంగ్లా, మధ్యాహ్నం 12 గంటలకు మేకలగట్టు, 19న ఉదయం 10 గంటలకు ఖిలాషాపూర్, మధ్యాహ్నం 12 గం టలకు మాదారం, 20న ఉదయం 10 గంటలకు గోవర్ధనగిరిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు, సమావేశాలకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. సమావేశాలకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సం ఘాల నాయకులు, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## ఎస్.ఐ.ఆర్ అప్లికేషన్ నేను చేశాను... మరి మీరు చేశారా ?

- మీ ఓటు హక్కును కాపాడుకోవడానికి ఎస్.ఐ.ఆర్ అప్లికేషన్ చేయండి.



శేరిలింగంపల్లి కొండాపూర్ డివిజన్ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరు మీ అప్లికేషన్ ఫామ్ ను సంబంధిత ఆఫీసర్ బి.ఎల్.ఓ కి అందించండి. ఓటు దేశాన్ని మార్చడానికి సామాన్యుడి చేతిలో ఆయుధం. ఓటు దేశం పట్ల మనకున్న భాధ్యత, నా ఒక్క ఓటుతో మార్పు ఏం జరుగుతుంది అనుకోకండి. ఒక్క ఓటు దేశచరిత్రనే మార్చగలదు, అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ చాంద్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు.

# గోదావరిఖనిలో బీజేపీ భరోసా యాత్ర సభ..






- పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 14: పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గోదావరిఖనిలో మంగళవారం నిర్వహించిన బీజేపీ భరోసా యాత్ర సభ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సింగరేణి సంస్థ పరిస్థితి, కార్మికుల సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు. సింగరేణి అభివృద్ధిని కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని, సంస్థను ఆర్థికంగా బలహీనపరిచాయని ఆరోపించారు. మంగళవారం ఆయన ఓసిపి 5 సందర్శించారు. అక్కడ పెద్ద ఎత్తున కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో మహిళలు స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. కార్మికులతో కాసేపు మాట్లాడారు. అనంతరంగోదావరిఖనిలోని ఫైవ్ ఇంక్లైన్ గని ఆవరణలో జరిగిన సభలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఒకప్పుడు సుమారు 1.20 లక్షల మంది కార్మికులతో వెలుగొందిన సింగరేణిలో ప్రస్తుతం దాదాపు 35 వేల మంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. సంస్థ అభివృద్ధి కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వడంతో సింగరేణి బలహీనపడిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా అంతర్గత విభేదాలతో కాలం గడుపుతోందని విమర్శించారు.135 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థకు రావాల్సిన ప్రభుత్వ బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడంతో ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.సింగరేణి భవిష్యత్తు బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న ఆయన, తాడిచెర్ల బొగ్గు బ్లాక్--2ను నామినేషన్ విధానంలో సింగరేణికి కేటాయించామని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి సింగరేణి అంశాలను తీసుకెళ్లడంతోనే ఈ నిర్ణయం సాధ్యమైందన్నారు. సంస్థ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్రం అవసరమైన సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్య సేవలు, వారి పిల్లలకు నాణ్యమైన విద్యా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బొగ్గు బ్లాకులను ప్రైవేటు సంస్థలకు కేటాయించారని ఆరోపిస్తూ, 118 బొగ్గు బ్లాకుల కేటాయింపుల వ్యవహారంపై కాగ్, సుప్రీంకోర్టు, సీబీఐ విచారణలు జరిగాయని గుర్తు చేశారు. ఆ కేసుల్లో అప్పటి కాంగ్రెస్ నాయకులు జైలు పాలయ్యారని పేర్కొన్నారు.సింగరేణి పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, సంస్థ విస్తరణే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సింగరేణి అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఈటల రాజేందర్, మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్, గో మాస్ శ్రీనివాస్ మాజీ ఎంపీ వెంకటేష్ నేతకాని తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి కార్మికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## బాలికల ఆరోగ్యమే లక్ష్యం.డా.రూబీనాడా.రహ్మాన్..

- కస్తూర్బా
- విద్యార్థినులకు పరిశుభ్రతపై అవగాహన
- వంగర పీహెచ్సీ ఆధ్వర్యంలో ఆరోగ్య చైతన్య కార్యక్రమం శానిటరీ ప్యాడ్ల పంపిణీ..



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 14/అక్షరం న్యూస్:-

బాలికలు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకుని వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు సూచించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో మంగళవారం వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) ఆధ్వర్యంలో రుతుక్రమ పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థినులకు రుతుక్రమ సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత నియమాలు ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. అలాగే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో హెచ్పీవీ టీకా కీలక పాత్ర పోషిస్తుందని అర్హులైన బాలికలు తప్పనిసరిగా టీకా తీసుకోవాలని సూచించారు.అనంతరం భీమదేవరపల్లి సర్పంచ్ కుమారస్వామి స్పాన్సర్ చేసిన శానిటరీ ప్యాడ్లను విద్యార్థినులకు పంపిణీ చేశారు. బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి సర్పంచ్ కుమారస్వామి, డా. రుబీనా, డా. రహ్మాన్, ఏఎన్ఎంలు స్వరూప, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: ఈ నెల 18న చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఇరువర్గాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గోదావరిఖనిలోని అదనపు జిల్లా న్యాయస్థానంలో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం గోదావరిఖనిలో 709 చెక్ బౌన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 117 కేసుల్లో నాన్‌బెయిలబుల్ వారెంట్లు అమల్లో ఉన్నాయని తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు పరస్పర రాజీతో కేసులను పరిష్కరించుకుని ప్రశాంతమైన జీవనం గడపాలని సూచించారు. లోక్ అదాలత్ విజయవంతానికి న్యాయవాదులు చొరవ తీసుకుని కక్షిదారులను ప్రోత్సహించాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు జిల్లా న్యాయమూర్తి కోట్ల లావణ్య బాల్ రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి జీవన్ సూరజ్ సింగ్, మున్సిఫ్ మేజిస్ట్రేట్లు నల్లాల వెంకట సచిన్ రెడ్డి, స్వారీక, బార్ అసోసియేషన్ ప్రతినిధులు బల్మూరి అమరేందర్ రావు, గుజ్జేటి సత్యనారాయణ, కుడిది వెంకటేష్, ముచ్చకుర్తి కుమార్, ప్రసన్న, అసంపల్లి రవీందర్, అంజలి, తిలక్, బార్ కౌన్సిల్ సభ్యురాలు చందాల శైలజతో పాటు పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# కనీస వేతనాలను నెలకు రూ.26 వేలకు పెంచాలి





• **100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని వెంటనే ఏర్పాటు చేయాలి సీఐటీయూ**

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

కేంద్ర ప్రభుత్వం 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల ఉత్తర్వులను వెంటనే సవరించి, నెలకు కనీస వేతనాన్ని రూ.26 వేలకు తగ్గకుండా నిర్ణయించాలని సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కమిటీ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. అలాగే రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని తక్షణమే నిర్మించాలని కోరింది. మంత్రి సింగరేణి పర్యటన సందర్భంగా మంగళవారం గోదావరిఖని ఓసీపీ-5 వద్ద సీఐటీయూ ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. బిక్షపతి మాట్లాడుతూ, సింగరేణి, ఎన్టీపీసీ, రామగుండం ఎరువుల కర్మాగారం, బసంత్‌నగర్ సిమెంట్ పరిశ్రమ, రైల్వేలు, చమురు సంస్థలు తదితర ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న సుమారు 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులు కనీస వేతనాల సవరణ లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతున్నప్పటికీ కార్మికుల వేతనాలు పెంచడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. కనీస వేతనాల చట్టం ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి వేతనాలను సవరించాల్సి ఉండగా, 2017 జనవరి 19న జారీ చేసిన ఉత్తర్వుల గడువు 2022 జనవరి 18తో ముగిసినా ఇప్పటి వరకు కొత్త ఉత్తర్వులు జారీ చేయలేదని గుర్తు చేశారు. దీనివల్ల వేలాది మంది కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. యాజమాన్యాల లాభాలకు ఎలాంటి పరిమితులు విధించని ప్రభుత్వం, కార్మికుల భవిష్యనిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా, బోనస్‌లపై పరిమితులు విధించడం అన్యాయమని పేర్కొన్నారు. కార్మికులకు నష్టం కలిగించే విధంగా తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలను సవరించి, కార్మికుల హక్కులకు భంగం కలిగించే నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి సీఐటీయూ పలు డిమాండ్లు వినిపించింది. కనీస వేతనాలను నెలకు రూ.26 వేలుగా నిర్ణయించడం, భవిష్యనిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా, బోనస్‌లపై ఉన్న పరిమితులను తొలగించడం, కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడం, కార్మికులకు నష్టం చేసే నిబంధనలను రద్దు చేయడం, రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 100 పడకల ఉద్యోగుల రాష్ట్ర బీమా ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరింది. వినతిపత్రం సమర్పించిన వారిలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి, జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. బిక్షపతి, జిల్లా కోశాధికారి ఎం. రామాచారి, జిల్లా కమిటీ సభ్యులు గీట్ల లక్ష్మారెడ్డి, ఎండీ యాకుబ్, ఆరేపల్లి రాజమౌళి, గౌస్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రామగుండం పోలీస్ కమిషనర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సింగరేణి భరోసా యాత్రలో పాల్గొనేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాకు వచ్చిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని మంగళవారం ఆర్జీ-01 పరిధిలోని ఓసీపీ-05 వద్ద రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## ROFR భూములను భూభారతి పోర్టల్ లో అవకాశం కల్పించడం పై ఆదివాసులు హర్షం

• **పూనేం సందీప్ కుమార్ తుడుం దెబ్బ మండల అధ్యక్షులు**



మహబూబాబాద్ జిల్లా / కొత్తగూడ/జులై 14(అక్షరం న్యూస్ ) ఉమ్మడి మండలాల్లో

ఎన్నో ఏళ్లుగా జల్ జంగిల్ జమీన్ నినాదంతో ఆదివాసులు పోరాటం చేస్తే వారి భూములపై హక్కులు కల్పించబడ్డాయి. ఈ పోరాటంలో ఎందరో ఆదివాసులు అమరులయ్యారు అటవీ భూములపై ఆదివాసీల హక్కుల కోసం లిఅటవీ హక్కుల గుర్తింపు-చట్టం 2006లి వచ్చిందని దీని ద్వారా దేశవ్యాప్తంగా ఆదివాసులు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు హక్కు పత్రాలు ఇచ్చిన వాటికి ఎటువంటి రుణాలు లేకపోవడంతో ఆదివాసి రైతులు సాగుకు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ లో =ాఖీ= భూములకు భూభారతిలో చోటు కల్పించడంతో ఆదివాసులు సాగులో ఉన్న =ాఖీ= భూములకు పూర్తి హక్కులు వచ్చాయని దీనితో ఆదివాసీ రైతులు బోర్లు, బావులు,కరెంటు,బ్యాంకు రుణాలు, =ాఖీ= పట్టా కలిగిన ఆదివాసి రైతులు యొక్క వివరాలు తప్పుగా ముద్రణ అయినట్లయితే మార్చుకోవాల్సిందిగా ఆకాశం ఉంటుందని ఈ అవకాశాన్ని ఉమ్మడి కొత్తగూడ మండలంలో ఉన్న ఆదివాసి రైతులు సద్వినియోగం చేసుకోవాలని తుడుం దెబ్బ నాయకులు అన్నారు. ఆదివాసి రైతులు సాగు చేసుకుంటున్నా =ాఖీ= భూముల వివరాలు భూభారతి పోర్టల్ లో చేర్చేందుకు కృషిచేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వనికి యావత్ ఆదివాసీ తరుపున ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవించే ఆదివాసీ రైతులకు ప్రభుత్వం స్పందించి గిరివికాసం పథకశీ లో ×ణూ ద్వారా బోర్లు వేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని తుడుం దెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమం లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మండల నాయకులు మల్లెల సారయ్య ఈసం వెంకన్న ఇర్ప రవి గట్టి నరేందర్ ఈసం రంగ రావు రేగా శ్యాం తదితరులు పాల్గొన్నారు.

## భద్రతా చర్యలపై బ్యాంకు మేనేజర్ల తో సమావేశం



పెద్దపల్లి జిల్లా/సుల్తానాబాద్/ జూలై 14, అక్షరం న్యూస్.

సుల్తానాబాద్ పట్టణ సర్కిల్ కార్యాలయంలో మంగళ వారం రోజు సీ.ఐ. రంజిత్ రావు ఆధ్వర్యంలో పట్టణం లోని అన్ని బ్యాంకుల మేనేజర్ల తో భద్రతా ఏర్పాట్ల తో పాటు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకుల్లో నాణ్యమైన సీ.సీ కెమెరాలు, అలారం వ్యవస్థలు, స్ట్రాంగ్ రూమ్ భద్రత, ఫైర్ సేఫ్టీ పరికరాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం, నగదు రవాణా సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించడం వంటి అంశాలపై బ్యాంకు మేనేజర్లకు పలు సూచనలు చేశారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఖాతాదారులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని, బ్యాంకు భద్రతకు సంబంధించిన అన్ని ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్.ఐ చంద్రకుమార్, పోలీసు సిబ్బంది తో పాటు పట్టణంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లు , అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించాలి

• **కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు**



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సింగరేణి కాలరీస్ కంపెనీకి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించాలని ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. జనక్ ప్రసాద్ నేతృత్వంలోని నాయకులు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని శ్రీరాంపూర్ అతిథి గృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల సింగరేణికి తాడిచెర్ల--2 బొగ్గు గని బ్లాక్ కేటాయింపునకు సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి ఐఎన్‌టీయూసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించాల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ హోదా లభిస్తే భూసేకరణ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు చట్టపరమైన, పర్యావరణ అనుమతులు త్వరగా లభిస్తాయని, కొత్త గనుల విస్తరణకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. అలాగే దేశ ఇంధన భద్రత బలోపేతం కావడంతో పాటు తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో సింగరేణి మరింత కీలక పాత్ర పోషించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, ఉపాధ్యక్షులు శ్యామ్, దాస్, సదానందం, ప్రధాన కార్యదర్శి వికాస్ కుమార్ యాదవ్, గనుల సిబ్బంది విభాగం ఇన్‌చార్జి తిరుపతి రాజు, ఉప ప్రధాన కార్యదర్శి గరిగె స్వామితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## జన సాహిత్య అకాడమీ అవార్డ్ అందుకున్న సంబోజి సునీల్

• **ఫోటో,వీడియో గ్రాఫర్ సోషల్ సర్వీస్ సంబోజి సునీల్**




చొప్పదండి /కరీంనగర్,జులై 14 (అక్షరం న్యూస్ )

జన సాహిత్య అకాడమీ ద్వారా చొప్పదండికి చెందిన సంబోజి సునీల్ చేస్తున్న ఫోటో అండ్ వీడియో గ్రాఫర్,సోషల్ సర్వీస్ పనులను గుర్తించి అకాడమీ ద్వారా తెలుసుకొని ఉత్తమ జన సాహిత్య అవార్డును మంగళవారం రోజున హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జన సాహిత్య అకాడమీ సమస్త అధినేతలతో పాముల రమణ ఆధ్వర్యంలో సునీల్ కి అవార్డును అందచేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి తెలంగాణ తొలి మాజీ ఉపముఖ్య మంత్రి తాటికొండ రాజయ్య చేతుల మీదిగా అవార్డు తీసుకోన్నారు.

## 36 ఏళ్ల తర్వాత ఒకేచోట చేరిన ఎన్ టి పి సి జడ్పీ ఉన్నత పాఠశాల తొలి బ్యాచ్ విద్యార్థులు



జ్యోతినగర్, ఎన్టిపిసి జూలై 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల (ఎన్‌టీపీసీ)లో 1989--90 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన తొలి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1984--85 విద్యాసంవత్సరంలో అప్పటి ఉన్నత ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతితో ప్రారంభమైన ఈ బ్యాచ్, అనంతరం పాఠశాల ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చెందిన తర్వాత తొలి పదో తరగతి బ్యాచ్‌గా నిలిచింది.

దాదాపు 36 సంవత్సరాల తర్వాత ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమకు



విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులతో పాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాఠశాలలోని ప్రతి విద్యార్థికి స్వీట్లు, పెన్నులు పంపిణీ చేశారు.

విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. అలాగే పాఠశాలకు ఉపయోగపడేలా ఆకర్షణీయమైన గోడ గడియారాన్ని పూర్వ విద్యార్థులు బహూకరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాత తరగతి గదులను సందర్శించి, విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పదో తరగతి తర్వాత జీవితంలో ఎదురైన అనుభవాలు, సాధించిన విజయాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ ఆత్మీయంగా గడిపారు. ఎంతో స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ మహా సమ్మేళనం అందరినీ భావోద్వేగానికి గురిచేసింది. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం డిమాండ్



జ్యోతినగర్ ఎన్టిపిసి, జూలై 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ప్రాంత కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నపూర్ణ కాలనీ దుర్గయ్యపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారని, దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగినా అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా సామాజిక శాస్త్రం, ఆంగ్లం బోధించే ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. పాఠశాలలో కంప్యూటర్లు ఉన్నప్పటికీ కంప్యూటర్ బోధకులు లేకపోవడంతో విద్యార్థులు కంప్యూటర్ విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. అలాగే వ్యాయామ ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్న పరిస్థితి నెలకొందన్నారు. మూత్రశాలలకు నీటి పైపులైన్ లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థులకు సరిపడా భోజన బల్లలు లేక నేలపైనే కూర్చొని భోజనం చేయాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. పాఠశాలలో నెలకొన్న అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం. రామాచారి, ఎన్. బిక్షపతి, జి. లక్ష్మారెడ్డి, కాదాసి మల్లేష్, గుండు కనకయ్య, టి. రవీందర్, కె. రాజయ్య, అక్కపాక శంకర్, గోపాలరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు నమూనా సేకరణ కార్మికులకు నైపుణ్య వర్గం వేతనాలు చెల్లించాలి

- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సింగరేణి రామగుండం ప్రాంతంలో బొగ్గు నమూనా సేకరణ పనులు నిర్వహిస్తున్న ఒప్పంద కార్మికులకు నైపుణ్య వర్గానికి తగిన వేతనాలు చెల్లించాలని కోరుతూ కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి కార్మికులు వినతిపత్రం సమర్పించారు. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం, బొగ్గు నమూనా సేకరణ సేవలను ఐదు సంస్థలు నిర్వహిస్తున్నాయి. రామగుండం ప్రాంతంలోని సింగరేణి బొగ్గు లోడింగ్ కేంద్రాలతో పాటు ఎన్టీపీసీ బొగ్గు దిగుమతి కేంద్రాల్లో ఒకే రకమైన పనిని చేస్తున్నప్పటికీ, సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు మాత్రం నైపుణ్యం లేని వర్గం వేతనాలే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే పని చేస్తున్న కోల్ ఇండియా సంస్థలోని బొగ్గు నమూనా సేకరణ కార్మికులకు, అలాగే సింగరేణి అనుబంధ సంస్థ జైపూర్‌లోని సింగరేణి ఉష్ణ విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులకు నైపుణ్య వర్గం వేతనాలు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. అయితే తాము గత పదేళ్లుగా ఇదే పని చేస్తున్నప్పటికీ నైపుణ్యం లేని వర్గం వేతనాలే అందుకుంటూ తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నామని తెలిపారు. పర్యవేక్షక స్థాయి ఉద్యోగులకు కూడా అర్ధ నైపుణ్య వర్గం వేతనాలే చెల్లించడం అన్యాయమని పేర్కొంటూ, వివక్ష లేకుండా అందరికీ నైపుణ్య వర్గానికి చెందిన వేతనాలు అమలు చేసి న్యాయం చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ మేరకు ఉద్యోగుల జాబితాను కూడా వినతిపత్రానికి జత చేశారు. ఈ కార్యక్రమంలో సుంకరి సురేష్, చిగురు లక్ష్మణ్, గొడుగు సమ్మయ్య, జనగామ రాయలింగు, బియ్యల మహేందర్, గడ్డం సురేష్, రాదండి శ్రీకాంత్, శ్రీనాథ్, రాపల్లి శ్రీకాంత్, సంతోష్, సతీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి

- 12వ వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్



సింగరేణి లో "భరోసా యాత్ర" పేరుతో మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా ఓసిపి-5 కి విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కి సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ వినతి పత్రం లో తెలంగాణలో ఉన్న బొగ్గు గను లను వేలం పాట లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని, 12వ వేజ్ బోర్డు ఒప్పంద ప్రక్రియను ప్రారంభించేందుకు తక్షణమే వేతన కమిటీని ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్ లతో సంబంధం లేకుండా గతంలో వలే 12వ వేజ్ బోర్డు వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా సింగరేణికి తాడిచర్ల బ్లాక్-2 ను కేటాయించినందుకు కేంద్ర మంత్రి కి శాలువా కప్పి శు భాకాంక్షలు తెలిపారు. వినతి పత్రం అందజేసి , కేంద్ర మంత్రి కి డిమాండ్ లను వెల్లడించిన వారిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శిమడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు ఉన్నారు, ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి నాయకులు లిమాదన మహేష్, బోగ సతీష్ బాబు, ఎస్. వెంకట్ రెడ్డి, గండి ప్రసాద్, మానాల శ్రీనివాస్, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతిలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం..

- ప్రభుత్వ వైద్య సేవలపై పెరుగుతున్న విశ్వాసం..
- గ్రామ పంచాయతీ కార్యదర్శికి సాధారణ ప్రసవం



సూర్యాపేట/నేరేడుచర్ల, జూలై 14: అక్షరం న్యూస్

ప్రభుత్వ వైద్య సేవల నాణ్యతకు మరోసారి నిదర్శనంగా నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం విజయవంతంగా సాధారణ ప్రసవం నిర్వహించారు. కోమటికుంట గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. నాగలక్ష్మి ప్రసవం కోసం నేరేడుచర్ల ప్రభుత్వ ఆసుపత్రిని ఎంపిక చేసుకుని, 3 కిలోల బరువున్న ఆరోగ్యవంతమైన పండంటి మగబిడ్డకు సహజ ప్రసవం ద్వారా జన్మనిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసంతో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవడం ప్రజలకు ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ప్రసవాన్ని వైద్యురాలు డాక్టర్ పున్న నాగిని ఆధ్వర్యంలో సిబ్బంది నర్సు ఉదయశ్రీ, మధ్యస్థ స్థాయి ఆరోగ్య సేవల అధికారి అంజలి, సహాయక నర్సు మిడ్‌వైఫ్ విజయసుశీల, ఆశా కార్యకర్త స్వప్న, ఇతర ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. అనంతరం తల్లి, శిశువుకు అవసరమైన వైద్య సంరక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అనుభవజ్ఞులైన వైద్య బృందం, నాణ్యమైన ప్రసూతి సేవలు, ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకుని ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక.. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు స్వాధీనం



సూర్యాపేట, జూలై 14: అక్షరం న్యూస్

సూర్యాపేట పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ట్రాఫిక్ ఉప నిరీక్షకుడు యాదవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత ప్రతి ఆటో డ్రైవర్‌పై ఉందన్నారు. ఆటో నడిపే ప్రతి ఒక్కరూ చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన అన్ని చట్టబద్ధ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నళ్లను తప్పనిసరిగా పాటించాలని, సిగ్నల్ ఉల్లంఘనలు చేయవద్దన్నారు. ఆటోల్లో అనుమతించిన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, రోడ్డుపై ఇష్టానుసారంగా వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకుంటామని ట్రాఫిక్ ఉప నిరీక్షకుడు హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, స్థానిక ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )జూలై 14: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో మండలంలోని మంగలిబండతండాకు చెందిన రైతు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని సిరి కాటన్ మిల్లు సమీపంలో వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. మంగలిబండతండాకు చెందిన నూనావత్ జమ్లా (64) అనే రైతు తన వ్యవసాయ బోరు మోటారును రిపేరు చేయించకోవడానికి తన టీవిఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనం పై ముందు భాగంలో పెట్టుకోని జనగామకు వెళ్తుండగా, ప్రమాదవశాత్తు వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో తీ వ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నీటిని కాపాడితేనే భవిష్యత్‌కు భరోసా..

- నీటి పొదుపే భావితరాల సంపద..



సూర్యాపేట/నేరేడుచర్ల, జూలై 14: అక్షరం న్యూస్

నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రజల్లో నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో జల్ సంచయ్ జన భాగిదారి (జీజీడీ) 3.0 కార్యక్రమాన్ని మంగళవారం నీటిని ఆదా చేద్దాం -- భవిష్యత్ తరాలకు భద్రత కల్పిద్దాం" అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అధికారులు తెలిపారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, నీటి వృథాను నివారించడం, భూగర్భ జలాలను పెంపొందించడం, చెరువులు, కుంటలు పరిరక్షించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. భవిష్యత్ తరాలకు తాగునీటి భద్రత కల్పించేందుకు ప్రతి ఇంటా వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, నీటి వినియోగంలో పొదుపు పాటించాలని సూచించారు. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యావరణ, అటవీ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.



## రామగుండం సుందరీకరణకు మరో ముందడుగు.. ఏ-పవర్ హౌస్ సర్కిల్‌లో ఐలాండ్ నిర్మాణానికి స్థల పరిశీలన



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : రామగుండం పట్టణ సుందరీకరణలో భాగంగా ఏ-పవర్ హౌస్ సర్కిల్‌లో ప్రతిపాదిత ఐలాండ్ నిర్మాణానికి రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. పట్టణాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ ఐలాండ్‌ను ఆధునిక నమూనాలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. స్థానిక పరిస్థితులను పరిశీలించిన ఎమ్మెల్యే, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సుందరీకరణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పట్టణ అభివృద్ధికి ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## భూ రీ-సర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి తహసీల్దార్ వనజ నాయక్



ఓదెల/ పెద్దపల్లి జులై 15(అక్షరం న్యూస్)

భూ రీ సర్వే ను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ బానోత్ వనజ నాయక్ పేర్కొన్నారు ఈ సందర్భంగా మంగళవారం ఓదెల మండలంలోని గూడెం గ్రామంలోఈ సందర్భంగా గ్రామసభ నిర్వహించి రీ-సర్వే ప్రక్రియ, దాని ప్రయోజనాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సర్వే అండ్ బౌండరీస్ చట్టం--1923 ప్రకారం పూర్తిగా పారదర్శకంగా రీ-సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రక్రియతో భూ హద్దులు ఖచ్చితంగా నిర్ధారణ కావడంతో పాటు రికార్డులు నవీకరణకు నోచుకుని భూ వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు. భూ యజమానులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ తదితర అవసరమైన పత్రాలతో అందుబాటులో ఉండి అధికారులు, సర్వేయర్లకు సహకరించాలని కోరారు. గ్రామసభలకు హాజరై రీ-సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ రెడ్డి సర్పంచ్ చిట్ల రాము ముదిరాజ్ ఉప సర్పంచ్ బుడిగె కుమారస్వామి. వార్డు సభ్యులు ఉప్పుల ప్రశాంత్ శ్రీనివాస్. శ్రీధర్ శ్రీనివాస్ తిప్పార ప్రభాకర్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు, సర్వేయర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బండారి మారుతిపై పీడీ ఉత్తర్వులకు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బండారి మారుతిపై జారీ చేసిన నిరోధాత్మక నిర్బంధ (పీడీ) ఉత్తర్వులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రివెన్షన్ ఆఫ్ బ్లాక్ మార్కెటింగ్ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ సప్లై ఆఫ్ ఎసెన్షియల్ కమోడిటీస్ చట్టం--1980 ప్రకారం కమిషనర్ జూలై 6న జారీ చేసిన పీడీ ఉత్తర్వులను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం సాధారణ పరిపాలన (ప్రత్యేక శాంతిభద్రతలు) శాఖ జి.ఓ.ఆర్.టి. నెం.1013, తేదీ 13-07-2026 ద్వారా వాటిని ధ్రువీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బండారి మారుతిపై అమలులో ఉన్న పీడీ ఉత్తర్వులు కొనసాగనున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా చూడటం, ప్రభుత్వ ఆదాయాన్ని పరిరక్షించడం పోలీస్ శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ నిత్యావసర వస్తువులను బ్లాక్ మార్కెటింగ్ చేయడం, ప్రభుత్వ వనరులను అక్రమంగా మళ్లించడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించే చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు.

ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనే వ్యక్తులు, ముఠాలు, వ్యాపారులపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ చట్టాన్ని అమలు చేయడానికి వెనుకాడబోమన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాల అక్రమాలపై కూడా ఇప్పటికే పీడీ చట్టాన్ని అమలు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రజల సంక్షేమానికి భంగం కలిగించే, ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేసే ఎలాంటి అక్రమ కార్యకలాపాలపైనా నిరంతరం కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## అమావాస్య సందర్భంగా కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో చండీ హోమం

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు అన్నప్రసాదం పంపిణీ..



హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/జూలై 14/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో అమావాస్య సందర్భంగా ప్రతి నెల నిర్వహించే చండీ హోమంను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ హోమంలో భక్తులు విశేషంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం స్వామివారికి మహానైవేద్యం సమర్పించి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, ఆలయ అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి. కిషన్ రావు మాట్లాడుతూ, ప్రతి అమావాస్య రోజున నిర్వహించే చండీ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేవస్థానంలో భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

# కుటుంబానికి తెలియకుండానే పోస్టుమార్టం..!





- పరిహారంపై మాటమార్పు ఆరోపణలు.. రోడ్డెక్కిన బాధిత కుటుంబం
- ముల్కనూరు--కొత్తకొండ రహదారిపై మహిళలతో కలిసి ధర్నా..
- ప్రమాదానికి కారణమైన గుగులోతు శ్రీనివాస్ వ్యక్తిపై కేసు నమోదు చేయాలని డిమాండ్..

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 14/అక్షరం న్యూస్:-

ఎల్కతుర్తి--ఇందిరానగర్ మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముత్తారం గ్రామానికి చెందిన వ్యక్తి మృతి ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే పోస్టుమార్టం నిర్వహించారని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు, స్థానిక మహిళలు ముల్కనూరు-కొత్తకొండ ప్రధాన రహదారిపై ముత్తారం హనుమాన్ ఆలయం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో కొంతసేపు రాకపోకలు స్తంభించాయి.

ప్రమాదానికి కారణమైన గుగులోతు శ్రీనివాస్‌పై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి తొలుత రూ.7 లక్షల పరిహారం అందిస్తామని హామీ ఇచ్చి, అనంతరం దానిని రూ.1.50 లక్షలకు తగ్గించారని ఆరోపించారు. ప్రస్తుతం అంత్యక్రియల ఖర్చుల పేరుతో రూ.20 వేలే ఇస్తామని ఇంటి కార్యక్రమాలకు మరో రూ.10 వేలతో సరిపెట్టాలని చెబుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు, మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రకటించిన పరిహారాన్ని పూర్తిగా అందజేయడంతో పాటు ప్రమాదానికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పరిస్థితి శాంతించింది. అయితే న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని గ్రామస్థులు స్పష్టం చేశారు.

## అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికి మచ్చ



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్, జూలై 14:

చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి వెళ్లకుండా ఎస్ఎఫ్ఐ నాయకులను మంగళవారం తెల్లవారుజామునే ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమేనని ఎస్ఎఫ్ఐ జిల్లా అద్యక్షుడు పొదల లవకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి వెళ్లకుండా ఎస్ఎఫ్ఎ నాయకులను పోలీసులు మందస్తుగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి ఎన్ని అడ్డంకులు ఎదురైన సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున అందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు...



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జూలై 14: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గంగాపురం మహేందర్అన్నారు. హైదరాబాద్ లోని ఇందిరా పార్కు వద్ద ఈ నెల 15న(బుధవారం) జరిగే మహా ధర్నా కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను సిపిఎం నాయకులు మండల కేంద్రంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ హైదరాబాద్ లో ని ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే మహా ధర్నాలో యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కడారి ఐలయ్య, పొదల నాగరాజు, మైలారం వెంకటేశ్వర్లు, ఎండి. జమాల్, శాడ వెంకటయ్య, చింతల యాదయ్య, కడారి పరుశరామ లు, సాయిప్రసాద్, అశోక్, కల్పన, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో ఫీజు రియంబర్స్మెంట్ సత్యాగ్రహ దీక్ష

- దీక్షకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బేరి రామచంద్ర యాదవ్ సంఘీభావం



హైదారాబాద్ ప్రతినిధి: ఫీజు రియంబర్స్మెంట్ సాధనకై ఆర్. కృష్ణయ్య హైదారాబాద్ లోనీ ధర్నా చౌక్ వద్ద సత్యాగ్రహ దీక్షచేపట్టారు. ఈ దీక్షకు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మద్దతు తెలిపారు. ఆర్. కృష్ణయ్యతో పాటు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ ఫీజు బకాయిల స్కీమును రద్దు చేయాలనే ప్రభుత్వ కుట్రను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజుల బకాయిలు 8 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని, పాత విధానం కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్. కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు పెద్ద ఎత్తున విద్యార్థులతో ర్యాలీగా తరలి వచ్చి మద్దతు ప్రకటించారు. ఈ సత్యాగ్రహ దీక్షకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ విచ్చేసినారు, తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేదరి మహేంద్ర సంఘం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు కొంటు ముకుందం , తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ , తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల సంఘాల ముఖ్య సలహాదారు పట్లూరి కృష్ణమోహన్ , శేరిలింగంపల్లి నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సాయిలు , బీసీ యువజన నాయకులు భేరి చంద్రశేఖర్ యాదవ్, బిసి సంఘాల నాయకులు కార్యకర్తలు యువజనులు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తుతో నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలి

- గంజాయి హాట్‌స్పాట్స్‌పై ప్రత్యేక నిఘా -- ప్రాపర్టీ కేసుల డిటెక్షన్ పెంచాలి.
- నెలవారి నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు.




భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూలై 14 / అక్షరం న్యూస్ –:
జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం నాడు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నేరాల పరిస్థితి, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, శాస్త్రీయ ఆధారాలతో పటిష్ఠమైన దర్యాప్తు నిర్వహించి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల విచారణలో జాప్యం సహించబోమని హెచ్చరిస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.సీసీటీఎన్ఎస్ 2.0, ఈ–సాక్ష్య, నాట్‌గ్రిడ్ వంటి సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగించి కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు.జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు గంజాయి హాట్‌స్పాట్స్‌ను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ర్యాపిడ్ డ్రగ్ టెస్ట్ కిట్లతో పరీక్షలు నిర్వహించి నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే అక్రమ మద్యం, జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర దాడులు నిర్వహించాలని సూచించారు.ప్రాపర్టీ కేసులను ప్రాధాన్యతగా తీసుకుని సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలతో త్వరితగతిన ఛేదించి దొంగిలించిన సొత్తును బాధితులకు అప్పగించాలని సూచించారు. వాహన తనిఖీలు, రాత్రి పెట్రోలింగ్, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ రోడీషీటర్లు, హిస్టరీషీటర్లు, బెయిల్‌పై ఉన్న నేరస్థులు, జైలు నుంచి విడుదలైన వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, డయల్–100కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర సహాయం అందించాలని ఆదేశించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి, మంత్రుల జిల్లా పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం / అశ్వాపురం / జూలై 14 / అక్షరం న్యూస్ –:
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లాలోని సీతమ్మసాగర్, సీతారామ ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) ప్రాజెక్టులను పరిశీలించడంతో పాటు నిర్వహించనున్న సమీక్ష సమావేశం నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను కలెక్టర్ పరిశీలించారు. హెలిప్యాడ్ నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అవసరమైన భద్రతా ప్రమాణాలు, బారికేడింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, రాకపోకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.అనంతరం అమ్మగారిపల్లి వద్ద నిర్వహించనున్న సమీక్ష సమావేశం ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు. సమావేశ వేదిక, అధికారుల, ప్రజాప్రతినిధుల కూర్చునే ఏర్పాట్లు, మీడియా ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.పర్యటన సందర్భంగా ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు సంబంధిత అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తమకు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన, సమీక్ష సమావేశం విజయవంతంగా నిర్వహించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ ంవహించాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాష్, నీటిపారుదల శాఖ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియలను వేగవంతం చేయాలి విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ అంకిత్





- చంద్రుగొండ మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్.

భద్రాద్రి కొత్తగూడెం / చంద్రుగొండ / జూలై 14 / అక్షరం న్యూస్ –:
జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం చంద్రుగొండ మండలంలో విస్తృతంగా పర్యటించి ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తిప్పనపల్లి గ్రామంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూసేకరణ సర్వే పనులు, మద్దుకూరు గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, అనంతరం చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూసేకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియలను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, క్రీడలకు అవసరమైన ప్రోత్సాహం అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ముందుగా తిప్పనపల్లి గ్రామంలో కొనసాగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూసేకరణ సర్వే పనులను పరిశీలించారు. సర్వే పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తిప్పనపల్లి గ్రామ పరిధిలో మొత్తం 70 ఎకరాల భూమికి సర్వే నిర్వహించాల్సి ఉండగా, ప్రతిరోజూ సుమారు 15 ఎకరాల మేర సర్వే చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన సర్వేను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి భూ యజమానికి సంబంధించిన వివరాలతో పాటు బోర్లు, సాగులో ఉన్న పంటలు, ఆయిల్ పామ్ తోటలు, ఇతర శాశ్వత ఆస్తుల వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.అనంతరం మద్దుకూరు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు



జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, డిజిటలైజేషన్, రికార్డుల నిర్వహణను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 65 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని అధికారులు వివరించగా, మిగిలిన ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా డిజిటలైజేషన్ చేపట్టాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు.



చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న సాంబార్ పలుచగా ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, యూనిఫాంల పంపిణీపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి విద్యార్థి వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పోషకాహారం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.ఈ పర్యటనలో కొత్తగూడెం ఆర్డీవో మధు, చంద్రుగొండ తహసీల్దార్ జగదీశ్వరరావు, ఎంపీడీవో అశోక్, ఇరిగేషన్ శాఖ అధికారులు, సర్వే అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## తప్పుడు ప్రచారాలు చేసే ఛానళ్ళపై కఠిన చర్యలు తీసుకోవాలి

- నాలుగున్నర దశాబ్దాలుగా మచ్చలేని నిజాయితీగల నాయకుడు కూనంనేని.
- నిరాధారమైన ఆరోపణలతో తప్పుడు వార్తలు ప్రసారం చేయడం తగదు.
- రాజకీయ కుట్రలతోనే ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారు.
- మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.



భద్రాద్రి కొత్తగూడెం /కొత్తగూడెం / జూలై 14 / అక్షరం న్యూస్ –: తప్పుడు ప్రచారాలు చేసే వార్తా ఛానళ్ళపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా డిమాండ్ చేశారు. కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుపై ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఒక ఛానల్‌లో వచ్చిన వార్తలపై ఆయన మంగళవారం జిల్లా కేంద్రంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ, గత నాలుగున్నర దశాబ్దాలుగా ఎలాంటి మచ్చ లేకుండా ప్రజల పక్షాన నిలబడి నిరంతరం శ్రమిస్తున్న నిజాయితీ గల నాయకుడు కూనంనేని సాంబశివరావు అని కొనియాడారు. నిరాధారమైన ఆరోపణలతో ఇలాంటి తప్పుడు వార్తలు ప్రసారం చేయడం తగదని, కూనంనేని వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యవహరించడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జికి తానేమీ ఫిర్యాదు చేయలేదని ఎంపీ రఘురాం రెడ్డి స్వయంగా ప్రకటించారని, ఛానళ్లలో తప్పుడు వార్తలు రావడం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని మండిపడ్డారు. ఇప్పటికైనా మీడియా సంస్థలు వాస్తవాలు తెలుసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఇలాంటి దుష్ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు.

## కూనంనేనిపై ఫిర్యాదు వార్త పూర్తిగా అవాస్తవం

- ఛానల్లో వచ్చిన దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నా.
- ఎస్ఐఆర్ ప్రక్రియపైనే మీనాక్షితో చర్చించాం.
- కాంగ్రెస్ అభివృద్ధి కార్యక్రమాలను వివరించాం.
- ప్రభుత్వంలో సిపిఐ, కాంగ్రెస్ కలిసి ఉన్నాయి.
- ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి.



భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం / జూలై 14 / అక్షరం న్యూస్–: శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావుపై తాను కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఓ ప్రముఖ ఛానల్‌లో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తమని, సదరు దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వార్త ఛానల్లో ప్రసారమైన వార్తలపై మంగళవారం అయన వివరణ ఇచ్చారు. ఎమ్మెల్యే కూనంనేని ఇసుక దందాలు, భూకబ్జాలు చేస్తున్నారని తాను ఫిర్యాదు చేసినట్లు సదరు ఛానల్‌లో ప్రసారం చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కేవలం కాంగ్రెస్ ఎంపీలను పిలిపించి ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి మాత్రమే వివరణ తీసుకున్నారని ఎంపీ రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వివరాలు సేకరించారని, అందులో భాగంగానే తాము కూడా పాల్గొన్నామని తెలిపారు. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ప్రోగ్రెస్ రిపోర్ట్, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మాత్రమే తాము మీనాక్షి నటరాజన్‌కు కూలంకషంగా వివరించామని చెప్పారు. రాజకీయ లబ్ధికోసమే ఇలాంటి తప్పుడు వార్త ప్రసారం చేయించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంలో సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు కలిసికట్టుగా ఉన్నాయని, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని రామసహాయం రఘురాం రెడ్డి వివరిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

# గిరిజన సమాఖ్య మహాసభలను జయప్రదం చేయాలి.

- గిరిజనుల హక్కులు, సమస్యల సాధనకు పోరాడుతాం.
- 18న మహా ప్రదర్శన, 19న ప్రతినిధుల సభ.
- మహాసభల ప్రచార కరపత్రాల విడుదల.
- సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య.



భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం / జూలై 14 అక్షరం న్యూస్ –: గిరిజన సమాఖ్య మూడో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ పరిధిలోని సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో మంగళవారం పట్టణ సమితి ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సమాఖ్య మహాసభల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ నెల 18, 19 తేదీల్లో పాల్వంచలో తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్) మూడో రాష్ట్ర మహాసభలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతాయని వివరించారు. మహాసభల తొలిరోజు మధ్యాహ్నం భారీ ఎత్తున మహా ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయని, 19న ప్రతినిధుల సభ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ నందు జరుగుతుందని తెలిపారు. ఈ పోరాట మహాసభల్లో గిరిజనులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ నాయకులు గెడ్డాడు నగేష్, మాచర్ల శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, ఎండి యూసుఫ్, నేరెళ్ల శ్రీను, కృష్ణ, వాడే రాములు, మండల రాజేశ్వర్ రావు, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కూనంనేని సాంబశివరావు మీద దుష్ప్రచారాన్ని ఖండించిన రాష్ట్ర మైనారిటీ నాయకులు డా. నయీమ్ ఖురేషి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / కొత్తగూడెం / జులై 14 / అక్షరం న్యూస్ –:సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మీద 10 టీవీ ఛానల్ లో దుష్ప్రచారం చేస్తున్నట్టు వస్తున్న వార్తలు ఆవాస్తవమని ఆ వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని మచ్చ లేని నాయకుడిగా ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కూడా కొత్తగూడాన్ని ఎంతో అభివృద్ధి చేశారని నయీమ్ ఖురేషి తెలిపారు. ఎంపీ రఘురాం రెడ్డి వీడియో ద్వారా వివరణ ఇస్తూ ఏం ఎల్ ఏ సాంబశివరావు మీద వస్తున్న ఆరోపణలు ఖండించారని తెలిపారు.

# చొక్లతాండ గ్రామ ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ మరియు భూమి నష్టపరిహారం నిధులు విడుదల చేయాలని వినతి



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 14 / : ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు డీసీసీ అధ్యక్షులు బీర్లా అయిలయ్య ని కలిసి బస్వాపూర్ రిజర్వాయర్ లో ముంపుకు గురవుతున్న చోక్లతండా గ్రామ ప్రజలకు వెంటనే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మరియు భూమి నష్ట పరిహారం నిధులు విడుదల చేయాలని కోరడం జరిగింది. ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ అతి త్వరలో మీకు డబ్బులు వస్తాయని గ్రామ ప్రజలు ఎవరు అధైర్య పడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.ఏ.సి.ఎస్ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచ్ల పోరం మండల అధ్యక్షులు చాడ భాస్కర్ రెడ్డి, సర్పంచ్ల పోరం జిల్లా ప్రచార కార్యదర్శి భూక్య రాజారామ్ నాయక్, డీసీసీ ఉపాధ్యక్షులు ధనావత్ భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అస్సాం కామాఖ్య అమ్మవారి దర్శనం చేసుకోనీ ప్రత్యేక పూజలు నిర్వహించిన

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హేమెంధర్ గౌడ్.



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 14 / : మంగళవారం రోజు అతి శక్తివంతమైన జేస్టా అమావాస్య సందర్భంగా శక్తిపీఠమైన శ్రీ కామాఖ్య అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన యాదగిరిగుట్ట మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హేమెంధర్ గౌడ్ మరియు ఎరుకల అనిల్ గౌడ్ , బండ కింది ఆంజనేయులు గౌడ్, గుండ్లపల్లి శ్రీరాం గౌడ్, పబ్బా రామకృష్ణ గౌడ్, కోల చంద్రమౌళి గౌడ్, బేడం సతీష్,కంటేకర్ సంతోష్, వెల్దుర్తి నరేష్ చారి, గోపాలపురం సంతోష్ చారి, చిన్నోజు కిషోర్ కుమార్ చారి తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును కాపాడుకోవాలని శివాజీ యువజన మండలి విజ్ఞప్తి.



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 14 / : ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బీఎల్ఓ లతో కలిసి ఇప్పటికీ ఎన్యూమరేషన్ ఫారమ్ నింపని ఓటర్ల వివరాలను సేకరించి, వారికి వ్యక్తిగతంగా సమాచారం అందించి, వెంటనే ఫారమ్ నింపి సమర్పించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని అవగాహన కల్పించడం జరిగింది. ఇంకా ఎవరైనా ఎన్యూమరేషన్ ఫారమ్ నింపకుండా ఉంటే, ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత బీఎల్ఓను సంప్రదించి ఫారమ్ నింపి సమర్పించాలని శివాజీ యువజన మండలి విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో శివాజీ యువజన మండలి అధ్యక్షులు, ఉప సర్పంచ్ మజ్జిగ నరేశ్, ప్రధాన కార్యదర్శి తొండల అనిల్ కుమార్ గౌడ్, యువజన మండలి సభ్యులు ఎండీ అజీమ్, సూరారం రాము, పాశం శేఖర్, ఎండీ షానూర్, తవిటి రాజు, పంజాల మధు, మల్గ క్రాంతి, గంగారాపు రాజు, నాతి వినయ్, కోరే హరీష్, ఉగ్గె ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండి సరిగ్గా పనిచేయాలంటే..

- ఈ ఆహారాలను రోజూ తీసుకోవాలి..

ఫైబర్ శరీరానికి చాలా అవసరం. జీర్ణవ్యవస్థకు ఫైబర్ ఒక రాజు వంటిది అని చెప్పవచ్చు. కానీ అన్ని ఫైబర్‌లు ఒకేలా ఉండవు. ఫైబర్ అధికంగా ఉన్నప్పటికీ కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరంతో పాటు అజీర్తి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కనుక కడుపుకు ఇబ్బంది లేకుండా, కడుపు ఉబ్బరం రాకుండా, శరీరానికి స్థిరమైన శక్తిని ఇచ్చే అధిక ఫైబర్ ఉన్న స్నాక్స్ తీసుకోవడం మంచిది అని వైద్యులు చెబుతున్నారు. కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు చాలా మందిలో సాధారణంగా కనిపిస్తాయి. అలాంటి వారు ఈ స్నాక్స్ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. అమెరికన్ డైటరీ గైడ్‌లైన్స్ ప్రకారం, రెండు సంవత్సరాల పైబడిన వ్యక్తులు రోజుకు తీసుకునే ప్రతి 1,000 కేలరీలకు సుమారు 14 గ్రాముల ఫైబర్ తీసుకోవాలి. 12 నెలల నుంచి 23 నెలల మధ్య ఉన్న పిల్లలకు రోజుకు 19 గ్రాముల ఫైబర్ ఇవ్వాలి. ఫైబర్ ఆరోగ్యానికి చాలా అవసరం అయినప్పటికీ, అధిక ఫైబర్ ఉన్న ప్రతి ఆహారం సులభంగా జీర్ణం అవ్వాలని లేదు. కనుక తరచూ కడుపు ఉబ్బరం వంటి సమస్యలతో బాధపడే వారు జీర్ణ ఆరోగ్యానికి సహాయపడే విత్తనాలు, గింజలు, సంపూర్ణ ధాన్యాలు, పండ్లు తీసుకోవడం మంచిది. ఫైబర్ అధికంగా ఉండడంతో పాటు కడుపు ఉబ్బరాన్ని తగ్గించి జీర్ణ వ్యవస్థకు మేలు చేసే కొన్ని ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### విత్తనాలు, గింజలు..

గుమ్మడికాయ గింజలు, సబ్జా గింజలు, పొడి చేసిన అవిసె గింజలు, చియా గింజలు వంటి వాటిలో ఫైబర్ అధికంగా ఉండడంతో పాటు వీటిని తీసుకోవడం వల్ల పొట్ట ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. అలాగే కొన్ని రకాల గింజల్లో ఫైబర్ అధికంగా ఉన్నప్పటికీ సులభంగా జీర్ణమవుతాయి. వాల్‌నట్స్, డ్రై రోస్టెడ్ పల్లీలు, మఖానా వంటివి సులభంగా జీర్ణమవ్వడంతో పాటు వీటిలో ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. అలాగే బటర్, నెయ్యి వంటివి వేయకుండా ఎయిర్ పాప్ చేసిన పాప్ కార్న్ వంటి స్నాక్స్ కూడా తీసుకోవచ్చు. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉండడంతో పాటు సులభంగా జీర్ణమవుతాయి. అదే విధంగా స్ప్రౌటెడ్ బ్రెడ్, సవర్డో బ్రెడ్, స్టీల్-కట్ ఓట్స్ వంటి సంపూర్ణ ధాన్యాలతో చేసిన ఆహారాలు కూడా జీర్ణవ్యవస్థకు అనుకూలంగా ఉండడంతో పాటు శరీరానికి ఎక్కువసేపు శక్తిని అందిస్తాయి. టెంపెహ్, ఫర్మ్ లేదా ఎక్స్‌ట్రా-ఫర్మ్ టోఫు వంటి మొక్క ఆధారిత ప్రోటీన్ ఆహారాలు సంతృప్తికరమైనవి. ఇవి తక్కువ ఉబ్బరాన్ని కలిగిస్తాయి. వీటిని ఫైబర్ అధికంగా ఉండే డైట్‌తో కలిపి తింటే కడుపుకు తేలికగా ఉంటుంది.

### పండ్లు, కూరగాయలు..

ఇక పండ్లు, కూరగాయలు సులభంగా జీర్ణం అవ్వడంతో పాటు అధిక ఫైబర్ ను కలిగి ఉంటాయి. ఉడికించిన క్యారెట్, బ్లూబెరీస్, స్ట్రాబెరీస్, రాస్ప్‌బెరీస్, కివీ పండు, ఆరెంజ్, మాండరిన్, కొంచెం పచ్చగా ఉన్న అరటిపండు, బొప్పాయి వంటి ఆహారాలు సులభంగా జీర్ణమవ్వడంతో పాటు కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తాయి. ఇటువంటి ఆహారాల్లో ఫైబర్ ఎక్కువగా ఉండడంతో పాటు పొట్టకు కూడా తేలికగా ఉంటాయి.

# రాత్రంతా ధనియాలు నానబెట్టి ఉదయాన్నే ఆ నీళ్లు తాగండి..

- ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలుసా..?




వంటింట్లో ఉండే రకరకాల మసాలా దినుసుల్లో ధనియాలు కూడా ప్రధానమైనవి. దాదాపు అన్ని రకాల వంటకాల్లో ధనియాలను సువాసన కోసం వినియోగిస్తుంటారు. ధనియాల్లోని ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే మన పూర్వీకులు ధనియాలను ఆహారంలో భాగం చేశారు. అయితే ధనియాలను కేవలం వంటల్లో ఉపయోగించడం ద్వారా మాత్రమే కాకుండా.. ఔషధంగా కూడా వినియోగించవచ్చు. ధనియాలను రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఆ నీళ్లను ఉదయాన్నే తాగితే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయట. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

### ప్రయోజనాలు..

ప్రతిరోజు ఉదయం నానబెట్టిన ధనియాల నీటిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఫ్రీ రాడికల్స్‌కి వ్యతిరేకంగా పోరాడుతాయి. ఇమ్యూనిటీ వ్యవస్థను బలపరుస్తాయి. ఆరోగ్య నిపుణులు తెలిపిన ప్రకారం.. బరువు తగ్గాలనుకునే వారికి ఈ ధనియాల నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. ధనియాల నీటితో జీవక్రియ మెరుగవుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలకు చెక్ పెట్టొచ్చు. తీసుకున్న ఆహారం బాగా జీర్ణమవుతుంది. ధనియాల్లో విటమిన్ కె, విటమిన్ సి, విటమిన్ ఎ పుష్కలంగా లభిస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడంవల్ల జుట్టు ఆరోగ్యానికి ఎంతో మంచిది. ప్రతి రోజు ధనియాలు నానబెట్టిన నీటిని తీసుకుంటే జుట్టు రాలుడు సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. డయాబెటిస్ బాధితులకు కూడా ధనియాల నీరు ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉండేవారు ప్రతి రోజూ ఉదయం నానబెట్టిన ధనియాల నీటిని తీసుకుంటే షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయి. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గు లాంటి సమస్యలు దరిచేరకుండా ఉండాలంటే రోజూ ధనియాల నీటిని తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. కిడ్నీ సమస్యలతో బాధపడే వారికి కూడా ధనియాల నీరు బాగా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ సమస్యలు ఉన్నవారు కూడా ధనియాల నీటిని రోజూ పరగడుపున తీసుకోవాలి.

# వేసవి కదా అని కూల్ డ్రింక్స్‌ను అధికంగా తాగుతున్నారా..

- అయితే ఏం జరుగుతుందో తెలుసా..




వేసవి వేడి ప్రజలకు చల్లటి పానీయాలను తాగాలనే కోరిక కలిగిస్తుంది. ముఖ్యంగా తీపి రుచి, గ్యాస్ కలిగిన సాఫ్ట్ డ్రింక్స్ తాగడం ద్వారా వెంటనే దాహం తగ్గినట్లు అనిపిస్తుంది. అందుకే వేసవిలో సాఫ్ట్ డ్రింక్స్ వినియోగం గణనీయంగా పెరుగుతుంది. అయితే వీటిలో ఉండే అధిక చక్కెర, కెఫీన్ వంటి పదార్థాలు అలవాటుగా మారే ప్రమాదం ఉంది. పరిశోధనల ప్రకారం, ఈ పానీయాలను తరచుగా తీసుకోవడం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. సాఫ్ట్ డ్రింక్స్‌లో ఉండే అధిక ఫ్రుక్టోజ్ శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్‌కు దారితీస్తుంది. ఇది టైప్-2 డయాబెటిస్‌కు ముందస్తు సంకేతంగా పరిగణించబడుతుంది. అదనంగా, అధిక చక్కెర లివర్‌లో కొవ్వుగా మారి నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ సమస్యను కలిగించే అవకాశం ఉంది. దంతాల ఆరోగ్యంపైనా ఇవి ప్రతికూల ప్రభావం చూపుతాయి. సోడాలో ఉండే ఫాస్ఫారిక్, కార్బోనిక్ యాసిడ్లు దంతాల పైపొరను దెబ్బతీసి దంతాలు పుచ్చిపోవడానికి కారణమవుతాయి. అలాగే ఇవి కాల్షియం శోషణను తగ్గించి ఎముకలను బలహీనపరచి ఆస్టియోపోరోసిస్ ప్రమాదాన్ని పెంచుతాయి.

### అనేక విధాలుగా ప్రభావం..

సాఫ్ట్ డ్రింక్స్‌లో పోషక విలువలు చాలా తక్కువగా ఉంటాయి. ఇవి కేవలం ఎంప్టీ కాలరీలు మాత్రమే ఇస్తాయి. ఫలితంగా, శరీరానికి అవసరమైన పోషకాలు అందకుండా అదనపు కాలరీలు చేరి అస్వస్థకరమైన ఆహార అలవాట్లకు దారితీస్తాయి. అదేవిధంగా, లిక్విడ్ కాలరీలు తృప్తి కలిగించకపోవడంతో మరింత ఆహారం తీసుకునే అవకాశం ఉంటుంది. దీని వల్ల బరువు పెరగడం, ఊబకాయం, గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. సాఫ్ట్ డ్రింక్స్‌లో కెఫీన్ అధికంగా ఉంటుంది. కెఫీన్ అధికంగా ఉండే సాఫ్ట్ డ్రింక్స్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల గుండె వేగం పెరగడం, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా రాత్రి సమయంలో వీటిని తీసుకోవడం నిద్ర నాణ్యతను దెబ్బతీస్తుందని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో వీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ సమస్య కూడా రావచ్చు.

కెఫీన్, చక్కెర మూత్ర విసర్జనను పెంచి శరీరంలో నీటి శాతం తగ్గించే అవకాశం ఉంది. ఇక గుండె ఆరోగ్యంపై కూడా వీటి ప్రభావం ఉంటుంది. ప్రతిరోజూ చక్కెర పానీయాలు తీసుకునే మహిళల్లో గుండె జబ్బుల ప్రమాదం దాదాపు 20 శాతం వరకు పెరుగుతుందని ఒక అధ్యయనం చెబుతోంది.

## కోడిగుడ్లను ఎలా తింటే శరీరానికి అధిక మొత్తంలో పోషకాలు లభిస్తాయి.. వీటిని ఎలా తినాలి..?



అత్యంత పోషకపరమైన ఆహారాల్లో గుడ్లు కూడా ఒకటి. వీటిని రోజూ వారి ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరానికి ఎంతో మేలు కలుగుతుంది. వీటిలో అనేక పోషకాలు ఉంటాయి కనుక వీటిని సంపూర్ణ ఆహారంగా చెప్పవచ్చు. గుడ్లు కంప్లీట్ ప్రోటీన్ గా పరిగణించబడతాయి. శరీరం స్వయంగా తయారు చేసుకోలేని తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు గుడ్డులో ఉంటాయి. కండరాల పునరుద్దరణలో, పెరుగుదలలో, శరీర పనితీరుకు ఇవి ఎంతో సహాయపడతాయి. వీటితో పాటు గుడ్డులో విటమిన్ బి12, విటమిన్ డి, సెలీనియం, కొలిన్ వంటి ముఖ్యమైన పోషకాలు కూడా ఉంటాయి. బరువును నియంత్రించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, కంటి ఆరోగ్యాన్ని కాపాడడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. గుడ్డును వివిధ రూపాల్లో వండుకుని తీసుకుంటూ ఉంటారు. అయితే గుడ్లను వండే విధానం వాటి పోషక విలువలపై ప్రభావం చూపిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

### ఉడకబెట్టి లేదా పోచింగ్ చేసి..

గుడ్లను కొందరు పచ్చిగా తీసుకుంటారు. అయితే ఇలా తీసుకోవడానికి బదులుగా గుడ్లను వండి తీసుకోవడం వల్ల వీటిలో ఉండే ప్రోటీన్ సులభంగా జీర్ణమవుతుంది. అలాగే గుడ్డులో ఉండే బయోటిన్ అనే విటమిన్ ను శరీరం సులభంగా ఉపయోగించుకోగలుగుతుంది. గుడ్లను తక్కువ సమయం తక్కువ ఉష్ణోగ్రత మీద ఉడికించి తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే గుడ్లను ఉడకబెట్టడం లేదా పోచింగ్ చేయడం అత్యంత ఆరోగ్యకరమైన పద్దతుల్లో ఒకటి. గుడ్లను ఉడకబెట్టడం వల్ల నూనె, వెన్న వంటి వాటి అవసరం ఉండదు. దీంతో తక్కువ క్యాలరీలు, ఎక్కువ పోషకాలను తీసుకోగలుగుతారు. అలాగే తక్కువ ఉష్ణోగ్రతలో వండడం వల్ల వేడి వల్ల నశించే పోషకాలు ఎక్కువగా నశించకుండా ఉంటాయి. కొలెస్ట్రాల్ ఆక్సిడేషన్ కూడా తగ్గుతుంది.

### ఆలివ్ ఆయిల్ మేలు..

ఇక ఉడకబెట్టడంతో పాటు గుడ్లను స్క్రాంబుల్ చేసి కూడా తీసుకోవచ్చు. స్క్రాంబుల్ గుడ్లు కూడా ఆరోగ్యకరమైన ఎంపికల్లో ఒకటి. అయితే దీనిని తయారు చేసేటప్పుడు ఆలివ్ ఆయిల్ లేదా అవకాడో ఆయిల్ వంటి తక్కువ కొవ్వులు ఉన్న నూనెలను ఉపయోగించడం మంచిది. ఇందులో పాలకూర, క్యాప్సికం, టమాటా వంటి కూరగాయలు కలిపి తక్కువ ఉష్ణోగ్రత వద్ద వండి తీసుకోవడం వల్ల మరింత మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అదే విధంగా గుడ్లను ఎక్కువ సమయం ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద వండడం మంచిది కాదని ఇలా వండడం వల్ల హానికరమైన సంయోగాలు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే గుడ్డులో ఉండే పోషకాలను ఎక్కువ మొత్తంలో పొందడానికి వారు కొన్ని సూచనలను కూడా చేస్తున్నారు.

### కూరగాయలతో కలిపి అయితే..

ఎల్లప్పుడూ తాజా లేదా ఆర్గానిక్ గుడ్లను మాత్రమే ఎంచుకోవాలి. తాజా గుడ్లల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే వీటిని పాలకూర, టమాటా, క్యాప్సికం వంటి ఫైబర్ ఎక్కువగా ఉండే కూరగాయలతో కలిపి తీసుకోవడం మంచిది. గుడ్డులోని పోషకాలు ఎక్కువగా పచ్చసొనలోనే ఉంటాయి. కనుక గరిష్ట ప్రయోజనాల కోసం పచ్చసొనను తీసుకోవడం మంచిది. గుడ్డును ఎక్కువ వేడి వద్ద ఎక్కువ సమయం ఉడికించడం వల్ల విటమిన్ డి సుమారు 61 శాతం తగ్గుతుంది. కనుక వీటిని తక్కువ ఉష్ణోగ్రత వద్ద ఉడికించడం మంచిది. గుడ్డు ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ వీటిని మితంగా తీసుకోవడం మంచిది. ఆరోగ్యంగా ఉండే వ్యక్తులు రోజుకు ఒక గుడ్డు తినడం సురక్షితం అని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ విధంగా తగిన సూచనలను పాటిస్తూ గుడ్లను తీసుకోవడం వల్ల వాటి వల్ల కలిగే ప్రయోజనాలను అధిక మొత్తంలో పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## టాయిలెట్‌లో ఎక్కువ సేపు కూర్చుని ఫోన్ చూస్తే అంతే.. పైల్స్ గ్యారంటీ అంటున్న నిపుణులు..

టాయిలెట్‌లో కూర్చుని మొబైల్‌లో స్క్రోల్ చేయడం ఇప్పుడు చాలా మందికి అలవాటుగా మారిందని చెప్పవచ్చు. పెద్దలలో సుమారు 66% మంది టాయిలెట్‌లో కూర్చుని వార్తలు చూడటం లేదా సోషల్ మీడియా బ్రౌజ్ చేయడం చేస్తూ ఉంటారు. ఈ ఆధునిక అలవాటు కారణంగా చాలా మంది టాయిలెట్‌లో ఎక్కువసేపు కూర్చుంటున్నారు. ఇది వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా ఎక్కువసేపు కూర్చుని మొబైల్ ఉపయోగించడం వల్ల పెద్దప్రేగు దగ్గర ఉన్న రక్తనాళాలు ఉబ్బిపోయి పైల్స్ (హెమరాయిడ్స్) సమస్య వచ్చే అవకాశం ఉందని ఇవి అంతర్గతంగా లేదా బయట వైపు కూడా రావచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. మన దేశంలో సుమారు 4 కోట్ల మందికి పైగా పైల్స్ సమస్యతో బాధపడుతున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 10 లక్షల కేసులు కొత్తగా గుర్తించబడుతున్నాయి.

టాయిలెట్‌లో ఎక్కువ సేపు గడిపితే.. పైల్స్ సమస్యతో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుందని, టాయిలెట్ లో ఎక్కువ సమయం కూర్చోవడం కూడా ఇందుకు ఒక కారణమని నిపుణులు చెబుతున్నారు. అసలు టాయిలెట్‌లో కూర్చుని ఎక్కువ సమయం మొబైల్ వాడటం వల్ల పైల్స్ ఎందుకు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం. ాబఎశ్రీఅష ాఆఎత్ఘుతీఎ శీట ాషఅవఅష్వ ాఅవ లో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనం ప్రకారం, టాయిలెట్‌లో మొబైల్ స్క్రోల్ చేయడం వల్ల పైల్స్ వచ్చే ప్రమాదం 46% వరకు పెరుగుతుంది. దీని వల్ల నొప్పి, దురద, రక్తస్రావం కూడా రావచ్చు. హెమరాయిడ్స్ అనేవి పెద్దప్రేగు లేదా మలద్వారం వద్ద ఉన్న రక్తనాళాలు ఉబ్బిపోవడం వల్ల వస్తాయి. టాయిలెట్‌లో ఎక్కువసేపు కూర్చోవడం వల్ల మలద్వారం దగ్గర ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. దీని వల్ల అక్కడి రక్తనాళాలు విస్తరించి ఉబ్బిపోతాయి. కనెక్టివ్ టిష్యూ బలహీనపడుతుంది. మొబైల్ వాడటం వల్ల తెలియకుండా ఎక్కువ సమయం టాయిలెట్‌లో కూర్చుంటారు. దీని వల్ల మలద్వారంపై ఒత్తిడి పడి పైల్స్ వచ్చే అవకాశం పెరుగుతుంది. అంతేకాకుండా టాయిలెట్‌లో కూర్చొని మొబైల్ వాడటం వల్ల ఇతర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంటుందని నిపుణులు తెలియజేస్తున్నారు.

## రాత్రి సమయంలో ఆకలి అవుతుందా.. ఇలా ఎందుకు జరుగుతుంది.. ఏం చేయాలి..?



రాత్రి సమయంలో ఆకలిగా అనిపించినప్పుడు చాలా మంది తమని తాము నిందించుకుంటారు. అది కేవలం నియంత్రణ లేకపోవడం లేదా అనారోగ్యకరమైన స్నాక్స్ తినే అలవాటు వల్లనే అని భావిస్తారు. అయితే రాత్రి తరచుగా ఆకలి వేయడం అనేది చాలా సందర్భాల్లో శరీరంలోని జీవసంబంధ ప్రక్రియలు, హార్మోన్ల మార్పుల కారణంగా కూడా జరగవచ్చని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ఆకలి అవ్వడం అనేది శరీరంలోని అంతర్గత గడియారం, ఆకలి, తృప్తి, మెటాబాలిజాన్ని నియంత్రించే పలు హార్మోన్లపై ఆధారపడి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. నిద్ర సరిగా లేకపోవడం, ఒత్తిడి, మెటాబాలిక్ సమస్యలు లేదా హార్మోన్ మార్పులు వంటి కారణాల వల్ల ఈ వ్యవస్థలు ప్రభావితమైతే సాయంత్రం లేదా రాత్రి సమయంలో ఆకలి ఎక్కువగా అనిపించవచ్చని వారు చెబుతున్నారు.

### హార్మోన్ల ప్రభావం..

రాత్రి ఆలస్యంగా ఆకలి వేయడాన్ని చాలా మంది బలహీన సంకల్పంగా భావిస్తారు. కానీ చాలా సందర్భాల్లో అది శరీర జీవశాస్త్రంతో సంబంధం ఉంటుంది. ఆకలిని సర్కేడియన్ క్లాక్‌తో పాటు గ్రెలిన్, లెప్టిన్, ఇన్సులిన్, కార్టిసాల్ వంటి హార్మోన్లు నియంత్రిస్తాయి అని వైద్యులు చెబుతున్నారు. అలాగే ఏం తింటారనే విషయం ఎంత ముఖ్యమో, ఎప్పుడు తింటారనేది కూడా అంతే ముఖ్యమని, సాయంత్రం ఆలస్యంగా తినడం వల్ల ఆకలి పెరగడం, శరీరం క్యాలరీలను ఖర్చు చేసే సామర్థ్యం తగ్గడం జరుగుతుంది. దీని వల్ల బరువు పెరగడం, మెటాబాలిక్ వ్యాధుల ప్రమాదం కూడా పెరుగుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. అందువల్ల రాత్రి తరచుగా ఆకలి వేయడం అనేది కేవలం అలవాటు మాత్రమే కాకుండా నిద్ర సమస్యలు లేదా హార్మోన్ మార్పులు వంటి ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### రాత్రిపూట ఆలస్యంగా తింటే..

శరీరంలోని ఆకలి నియంత్రణ వ్యవస్థ చాలా సంక్లిష్టంగా ఉంటుంది. గ్రెలిన్ ఆకలిని పెంచుతుంది. లెప్టిన్ తృప్తి సంకేతాన్ని ఇస్తుంది. జీఎల్‌పీ-1, పెప్టైడ్ yy వంటి జీర్ణాశయ హార్మోన్లు భోజనం తర్వాత తృప్తిని పెంచుతాయి. ఇన్సులిన్ రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. కార్టిసాల్ ఒత్తిడి, నిద్ర నమూనాలను ఆహార కోరికలతో కలిపి ప్రభావితం చేస్తుంది. ఈ హార్మోన్లన్నీ రోజువారీ జీవ గడియారం ప్రకారం పనిచేస్తాయని నిద్ర తగ్గిపోవడం లేదా ఆలస్యంగా నిద్రించడం వల్ల ముఖ్యంగా సాయంత్రం సమయంలో ఆకలి సంకేతాలు ఎక్కువగా రావచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు. అలాగే ఒకే రకమైన క్యాలరీలు తీసుకున్నప్పటికీ రోజులో ఆలస్యంగా తినేవారిలో ఆకలి ఎక్కువగా ఉండడం, శక్తి వినియోగం తగ్గిపోవడం జరుగుతుందని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. హార్వర్డ్ మెడికల్ స్కూల్, బ్రిగ్హామ్ అండ్ ఉమెన్స్ హాస్పిటల్ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, ఆలస్యంగా తినే వ్యక్తుల్లో ఆకలి ఎక్కువగా ఉంటుంది. క్యాలరీలు ఖర్చయ్యే వేగం తగ్గుతుంది. కొవ్వు నిల్వకు సంబంధించిన హార్మోన్ మార్పులు కూడా జరుగుతాయి. నిద్ర లేకపోవడం ఈ సమస్యను మరింత పెంచుతుంది. నిద్ర తక్కువగా ఉంటే గ్రెలిన్ పెరిగి, లెప్టిన్ తగ్గిపోతుంది. దీని వల్ల ఎక్కువగా ఆకలి వేస్తుంది. అధిక క్యాలరీల ఆహారం తినాలనే కోరిక పెరుగుతుంది.

### ఎండోక్రైన్ లేదా మెటబాలిక్ వ్యాధులు ఉంటే..

ఇక వైద్యుల చెబుతున్న దాని ప్రకారం కొన్ని ఎండోక్రైన్, మెటాబాలిక్ వ్యాధులు కూడా రాత్రి ఆకలి పెరగడానికి కారణం కావచ్చు. స్థూలకాయం, PCOS, మెనోపాజ్ లేదా పెరిమెనోపాజ్, కుషింగ్స్ సిండ్రోమ్, స్లీప్ అప్నియా వంటి వ్యాధులు కూడా ఆకలి పెరగడానికి కారణం అవుతాయని వైద్యులు చెబుతున్నారు. వీటితో పాటు ఇన్సులిన్ రెసిస్టెన్స్, నిద్ర విఘాతం లేదా కార్టిసాల్ మార్పులు వంటివి కూడా రాత్రి సమయంలో ఆకలిని పెంచుతాయి. అలాగే స్త్రీలల్లో మెనోపాజ్ సమయంలో ఈస్ట్రోజెన్ స్థాయిలు తగ్గడం వల్ల నిద్ర సమస్యలు, మూడ్ మార్పులు, శరీర కొవ్వు పంపిణీ మార్పులు జరుగుతాయి. ఇవి కూడా స్త్రీలలో ఆకలి పెరగడానికి కారణమవుతుంది. అలాగే స్లీప్ అప్నియా వంటి నిద్ర సమస్యలు కూడా ఆకలి నియంత్రణను ప్రభావితం చేస్తాయి. ఇవి కూడా బరువు పెరగడం, మెటాబాలిక్ సమస్యలకు దారితీయవచ్చు.

### జీఎల్‌పీ-1 మందుల ప్రభావం..

అయితే కొత్తగా వచ్చిన జీఎల్‌పీ-1 హార్మోన్‌ను అనుకరించే బరువు తగ్గించే మందులు ఆకలిని తగ్గించడంలో సహాయపడుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ మందులు సాధారణంగా ఆకలిని తగ్గిస్తాయి. ఎప్పుడూ తినాలనే ఆలోచనని కూడా తగ్గిస్తాయి. అయితే కొన్ని పరిస్థితుల్లో రాత్రి ఆకలి కొనసాగవచ్చు. మందు మోతాదు ప్రారంభ దశలో ఉండటం, రోజులో తగినంత ప్రోటీన్ తీసుకోకపోవడం, వాంతుల భయం వల్ల భోజనం మానేయడం, నిద్ర సమస్యలు ఉండటం వల్ల ఆకలి అలాగే కొనసాగవచ్చు. జీఎల్‌పీ-1 రిసెప్టర్ అగోనిస్టులు మెదడులో తృప్తి కేంద్రాలను ఉత్తేజపరచి, జీర్ణశాయ-మెదడు సంకేతాలను మెరుగుపరచడం ద్వారా తక్కువ ఆహారం తినేలా చేస్తాయి. 2025 డిసెంబర్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) స్థూలకాయ చికిత్సలో జీఎల్‌పీ-1 మందులపై మొదటి మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మందులను కేవలం అందం కోసం కాకుండా దీర్ఘకాలిక వ్యాధి చికిత్సలో భాగంగా ఉపయోగించాలని సూచించింది.

### వైద్యులను కలవాలి..

కొన్నిసార్లు రాత్రి ఆకలి సాధారణమే అయినప్పటికీ రాత్రి తక్కువ బ్లడ్ షుగర్ లక్షణాలు, చెమటలు ఎక్కువగా పట్టడం, భయంకరమైన కలలు, ఉదయం తలనొప్పి, గందరగోళం, గుండె వేగంగా కొట్టుకోవడం, రాత్రి సమయంలో బ్లడ్ షుగర్ 70 mg/dL కంటే తక్కువగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. రాత్రి ఆకలి వేయడాన్ని చాలా మంది కేవలం అలవాటు లేదా నియంత్రణ లేకపోవడంగా భావిస్తారు. కానీ శాస్త్రీయ పరిశోధనలు చెబుతున్నదేమిటంటే హార్మోన్లు, నిద్ర, మెటాబాలిజం, శరీర జీవ గడియారం కలిసి ఈ సమస్యను ప్రభావితం చేస్తాయి. అప్పుడప్పుడు రాత్రి ఆకలి కావడం సహజం. అయితే ఇది తరచుగా జరుగుతూ ఇతర లక్షణాలతోపాటు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

## వేసవి కాలంలో తాగే కాంజీ పానీయం.. ఎలా తయారు చేయాలి.. దీంతో కలిగే లాభాలు ఏమిటి..?



కాంజీ అనేది పులియబెట్టిన సాంప్రదాయ భారతీయ వేసవి పానీయం. ఇది సాధారణంగా నల్ల క్యారెట్, ఆవాలు, నీరు కలిపి తయారు చేస్తారు. ఈ సాంప్రదాయ వేసవి పానీయంలో ప్రోబయోటిక్స్ సమృద్ధిగా ఉంటాయి. కనుక జీర్ణాశయ ఆరోగ్యానికి మేలు చేసేదిగా ఇది ప్రసిద్ధి చెందింది. కాంజీని తీసుకోవడం వల్ల జీర్ణ ఆరోగ్యం మెరుగుపడడంతోపాటు శరీరానికి కూడా అనేక ప్రయోజనాలు అందుతాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో, శరీరాన్ని చల్లబరిచే, హైడ్రేట్ చేసే పానీయాలు తీసుకోవడం చాలా అవసరం. అధిక వేడి కారణంగా జీర్ణవ్యవస్థ మందగిస్తుంది. అందుకే కాంజీ వంటి ఫెర్మెంటెడ్ పానీయాలు ఇప్పుడు ఎక్కువగా ప్రాచుర్యం పొందుతున్నాయి. శాస్త్రీయంగా కూడా ఇవి జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయని పరిశోధనలు కూడా సూచిస్తున్నాయి. కాంజీలో ఉన్న ప్రోబయోటిక్స్ వేసవిలో సహజంగా మందగించే జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయని అధ్యయనాలు కూడా తెలియజేస్తున్నాయి.

### అధిక సంఖ్యలో ప్రో బయోటిక్స్..

జీర్ణవ్యవస్థ సరిగా పనిచేస్తేనే రోగనిరోధక శక్తి కూడా మెరుగుపడుతుంది. శరీరంలోని 70–80% రోగనిరోధక కణాలు జీర్ణాశయంలోనే ఉంటాయి. అందువల్ల జీర్ణాశయం ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. కాంజీ ఫెర్మెంటేషన్ ప్రక్రియ ద్వారా తయారవుతుంది. కనుక ఈ ప్రక్రియ వల్ల దాని ఆరోగ్య ప్రయోజనాలు మరింత పెరుగుతాయి. కాంజీని సాధారణంగా సూర్యరశ్మిలో ఉంచి ఫెర్మెంట్ చేస్తారు. ఇలా చేయడం వల్ల ఇందులో ప్రోబయోటిక్స్ సంఖ్య పెరుగుతుంది. ఫెర్మెంటేషన్ సమయంలో ఉపయోగకరమైన సూక్ష్మజీవులు పెరుగుతాయి. ఇవి జీర్ణాశయంలోని మంచి బ్యాక్టీరియాను సమతుల్యంగా ఉంచి జీర్ణక్రియను మెరుగుపరచడంతోపాటు రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. కాంజీలో ముఖ్యంగా లాక్టోబాసిల్లస్, బిఫిడోబాక్టీరియం, ఎంటరోకోకస్ వంటి బ్యాక్టీరియాలు ఉంటాయి. ఇవి శక్తివంతమైన ప్రోబయోటిక్స్‌గా పనిచేస్తాయి.

### జీర్ణ సమస్యలు తగ్గేందుకు..

అదనంగా ఫెర్మెంటేషన్ ప్రక్రియ వల్ల శరీరంలో పోషకాల శోషణ కూడా పెరుగుతుంది. అందువల్ల కాంజీని భోజనంతోపాటు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా ఫెర్మెంటేషన్ వల్ల ఈ పానీయంలో మైక్రోన్యూట్రియెంట్స్ కూడా పెరుగుతాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. కాంజీ శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడంతోపాటు శరీరాన్ని హైడ్రేట్ చేసే ఒక పానీయం. కనుక దీనిని వేసవిలో ఎక్కువగా తీసుకుంటారు. సరైన విధంగా ఫెర్మెంట్ అయిన కాంజీలో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణాశయ లైనింగ్‌ను బలపరచడంలో, జీర్ణాశయంలో వాపులను తగ్గించడంలో, జీర్ణాశయం అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. కాంజీ తయారీలో ప్రధానంగా ఉపయోగించే నల్ల క్యారెట్, మసాలాలు శరీరానికి హైడ్రేషన్‌తో పాటు జీర్ణాశయం ఆరోగ్యాన్ని కూడా అందిస్తాయి. అందువల్ల ఇది సహజ ఇమ్యూనిటీ బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.

### ఇన్‌ఫెక్షన్లకు చెక్..

కాంజీ ఒక ఆరోగ్యకరమైన పానీయం. అయితే దాన్ని సరైన విధంగా నిల్వ చేసి సరైన సమయంలో తీసుకుంటేనే పూర్తి ప్రయోజనం పొందవచ్చు. దీన్ని చల్లగా లేదా గది ఉష్ణోగ్రతలో తాగవచ్చు. కానీ ఎక్కువ వేడి తగిలితే పాడయ్యే అవకాశం ఉంది. ఇక కాంజీ తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. వేసవిలో జీర్ణక్రియ మందగించి కడుపు ఉబ్బరం సమస్యలు రావచ్చు. కాంజీ వాటిని తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణాశయం ఆరోగ్యంగా ఉంటే రోగనిరోధక కణాలు కూడా బలంగా పనిచేస్తాయి. అందువల్ల సీజనల్ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. బయటి ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు శరీరాన్ని చల్లబరచి హీట్ ను తగ్గిస్తుంది. ఇలా కాంజీ ఎంతో సహాయపడుతుందని, వేసవి కాలంలో దీనిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు.

### కాంజీ తయారీ ఇలా..

అలాగే ఇంట్లో కూడా సులభంగా కాంజీని తయారు చేసుకోవచ్చు. కాంజీని తయారు చేయడం చాలా సులభం. ముందుగా నల్ల క్యారెట్, ఆవాలు, నీరు సరైన నిష్పత్తిలో కలపాలి. ఈ మిశ్రమాన్ని శుభ్రమైన గాజు సీసాలో నిల్వ చేయాలి. సీసాను గట్టిగా మూసి సూర్యరశ్మిలో ఉంచాలి. కనీసం ఒక వారం పాటు ఫెర్మెంట్ అయ్యేలా ఉంచాలి. ఒక్కొక్కరి రుచి ఒక్కోలా ఉంటుంది కనుక మసాలాల నిష్పత్తిని వారి రుచికి అనుగుణంగా మార్చుకోవాలి. అయితే కాంజీ ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ జీర్ణాశయ ఆరోగ్య సమస్యలు ఉన్న వారు వైద్యుల సలహా లేకుండా కాంజీని తాగకపోవడం మంచిది. ఆరోగ్యవంతులైనా ఎక్కువగా తాగితే జీర్ణక్రియ ఎక్కువగా జరిగి అసౌకర్యం కలగవచ్చు. కాబట్టి కాంజీని తీసుకోవడంలో మోతాదు, సమయం కూడా ముఖ్యమైనవి. మొత్తానికి కాంజీ ఒక సంప్రదాయ, తక్కువ ఖర్చుతో లభించే, ఆరోగ్యానికి ఉపయోగకరమైన పానీయం. వేసవిలో జీర్ణాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి కాంజీని తాగడం ఒక మంచి ఎంపిక అని చెప్పవచ్చు.

# ఎండల తీవ్రతకు పెరిగిన విద్యుత్ డిమాండ్

**హైదరాబాద్‌లోఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి**



హైదరాబాద్,జూలై14 ఎండల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్ డిమాండ్ భారీగా నమోదవుతోంది. అధిక ఉష్ణోగ్రతలతో ఏసీలు, కూలర్ల వాడకం పెరిగిందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది జూలై రెండు వారాల్లో రోజువారీ విద్యుత్ వినియోగం 61-71 మిలియన్ల యూనిట్ల ఉండగా, ఈ ఏడాది జూలై 11 తేది నాటికి 71-82 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవుతోంది. నగరంలో సాధారణం కంటే 4-5 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాబోయే వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2-3 డిగ్రీలు పెరిగే అవకాశాలుంటాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ జిల్లాలో సోమవారం గరిష్ఠంగా 36.7 డిగ్రీలు, కనిష్ఠం - 25.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో భానుడి భగ.. భగలకు నగరవాసులు అల్లాడిపోతున్నారు. వర్షాకాలం లోనూ వేసవి తరహాలో పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో నగరవాసులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 1 నుంచి జూలై 13 వరకు హైదరాబాద్ జిల్లాలో సాధారణంగా 175 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 100.1 మిల్లిమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 43 శాతం తక్కువని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో సాధారణం కంటే 26 శాతం, మేడ్చల్- మల్కాజిగిరిలో 54 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 28 తక్కువ వర్షపాతం ఈ సీజన్‌లో నమోదైంది.మరో వారం రోజులు భారీ వర్ష సూచనలు కన్పించడం లేదని బేగంపేట సీనియర్ వాతావరణశాఖ అధికారి జీఎన్ఆర్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం సాధారణం కంటే 3-4 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నగరంలో నమోదవుతున్నాయి. మరో 2-3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది.

## పల్నాడు జిల్లాలో విషాద ఘటన

- **పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య**

పల్నాడు,జూలై14 పల్నాడు జిల్లాలోని వినుకొండ మండలం విఠంరాజుపల్లిలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను హత్య చేసి, తానూ ఆత్మహకు పాల్పడింది. తల్లి నక్క భారతి(28) తన ఇద్దరు కుమారులు హేమంత్ రెడ్డి(5), తేజ(3)ను హత్య చేసిన అనంతరం తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం వెలుగులోకి వచ్చింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన గురించి తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోగా, కుటుంబ సభ్యుల రోదనలు హృదయాలను కలిచివేశాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు లేదా ఇతర వ్యక్తిగత కారణాల వల్లే ఈ ఘటన జరిగిందా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ప్రస్తుతం పోలీసులు అన్ని ఆధారాలను పరిశీలిస్తూ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## వియత్నాం నుంచి ముగ్గురి డెడ్ బాడీల రాక

- **శంషాబాద్‌లో ప్రత్యే అంబులెన్స్‌ల ద్వారా తరలింపు**
- **ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

అమరావతి,జూలై14 వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో మృతిచెందిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురి మృతదేహాలు మంగళవారం ఉదయం 7:30 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం కార్గో టెర్మినల్‌కు చేరుకున్నాయి. మృతుల్లో కడప జిల్లాకు చెందిన శ్రీధర్, మచిలీపట్నానికి చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ ఉన్నారు. మృతదేహాలను భారత్‌కు తీసుకురావడానికి అవసరమైన అన్ని చట్టపరమైన పక్రియలను ముంబైలో పూర్తి చేసిన తర్వాత కుటుంబసభ్యులకు అధికారులు నేరుగా అప్పగించారు. అనంతరం శంషాబాద్ విమానాశ్రయం నుంచి వారి స్వస్థలాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ.. కుటుంబసభ్యులకు, సన్నిహితులకు ధైర్యం చెప్పారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపించే పక్రియను స్వయంగా పర్యవేక్షించారు. హైదరాబాద్ నుంచి కడప, మచిలీపట్నం, హిందూపురం ప్రాంతాలకు మృతదేహాలను తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత అంబులెన్స్ సదుపాయం కల్పించింది. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

## ఇంద్రకీలాద్రిపై పెరిగిన రద్దీ

- **అమ్మవారి దర్శనానికి పెరిగిని భక్తుల రాక**

విజయవాడ,జూలై14: ఆషాడం మొదలు కానుండడంతో బెజవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమావాస్య మంగళవారం కూడా మంచిదన్న భావనతో అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలి రావడంతో భక్తజన సందోహంతో కళకళలాడింది. తెల్లవారు ఝాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికై తరలి వచ్చారు. అమ్మవారి ప్రసాదాలను కూడా భక్తులు పెద్ద ఎత్తుననే స్వీకరించారు. దర్శనం అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరిస్తూ భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాదాల పంపిణీ, భద్రత, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆషాఢ మాసంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతుండటంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దర్శనం, ప్రసాద సేవ, అన్నదానం, తలనీలాల సమర్పణతో ఆదివారం ఇంద్రకీలాద్రి భక్తి పారవశ్యంతో కళకళలాడింది. భక్తులందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తూ ఆలయం నుంచి ఆనందంగా తిరుగు ప్రయాణం అయ్యారు.

# ప్రహసనంగా మారిన సర్ ప్రక్రియ !



హైదరాబాద్,జూలై14.. ఆధార్ సక్రమంగానే ఉంటోంది. పాన్ కార్డు సక్రమంగానే ఉంటోంది. గ్యాస్ కనెక్షన్ కూడా పక్కాగా ఉంటోంది. బ్యాంక్ అకౌంట్ కూడా పక్కాగానే ఉంటోంది. ఇంటినంబర్లు, చెల్లింపులు ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ పక్కాగా ఉంటున్నా..ఓటు మాత్రం పక్కాగా ఉండడం లేదు. ఎఐని అడిగితే ఎలా పక్కాగా చేయవచ్చో చెబుతుంది. ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తే పక్కాగా ఓటరు కార్డు వస్తుంది. కానీ ఎన్నికల సంఘం, కేంద్రానికి ఇవేమీ పట్టడం లేదు. పర్మినెంట్ ఓటరు కార్డు నంబర్ ఉంటే ఓటు కోసం గందరగోళం పడాల్సిన అవసరం లేదు. ప్రజలు ఎవరికి వారు తమ ఓటును పక్కాగా ఉంచుకుంటారు. ఎవరైనా అడ్రస్ మారితే మార్చుకుంటారు. ఆధార్ విషయంలో ఇదే జరుగుతోంది. కానీ ఘనత వహించిన ఎన్నికల సంఘం మాత్ర దీనిని ఓ మాయగా తయారు చేసింది. చదువుకున్న వారికి సైతం అర్థం కాని ప్రక్రియగా చేశారు. టెక్నాలజీ ఇంతగా పెరిగినా ఉపయోగించుకోవడంలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫలం అయ్యిందని చెప్పాలి. తాజాగా కొనసాగుతున్న సర్ ప్రక్రియ ఓ ప్రహసనంగా మారంది. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ పక్రియ తీరు క్షేత్రస్థాయిలో ఘోరంగా తయారైంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అందరికీ ఎన్యుమరేషన్ ఫామ్‌లు పంచేసి రికార్డు సృష్టించామని అధికారులు చెప్తున్న లెకలకు, క్షేత్రస్థాయిలో ఓటర్లు ఎదురొంటున్న వాస్తవ పరిస్థితులకు అస్సలు పొంతన కుదరడం లేదు. ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ దాదాపు వందశాతం పూర్తయినట్టు రికార్డుల్లో చూపిస్తున్న ప్రాంతాల్లో కూడా కనీసం బూత్ లెవల్ అధికారులు అంటే బీఎల్‌వోలు అడుగుపెట్టలేదని ఓటర్లు చెబుతున్నారు. కొందరైతే వారెలా ఉంటారో కూడా చూసి ఉండలేదంటున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 99.98 శాతం మందికి ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ పూర్తయింది. 26 జిల్లాల్లో ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ వంద శాతం పూర్తి చేశామని అధికారులు కాగితాల్లో లెకలు చూపిస్తున్నారు. ఉన్నతాధికారుల సమీక్షల్లో శభాష్ అనిపించుకోవడానికి క్షేత్రస్థాయి సిబ్బంది చూపించిన ఈ అంకెల గారడీ ఇప్పుడు ఓటర్ల పాలిట శాపంగా మారింది. అధికారులు వంద శాతం పంపిణీ అని చెప్తుంటే.. నగర, పట్టణ ప్రాంతాల ఓటర్లు మాత్రం 'మా కాలనీ, మా ఇండ్లకు అసలు బీఎల్‌వోలు వచ్చిన దాఖలాలే లేవు. మాకు అందాల్సిన ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఎటు పోయాయని ప్రశ్నిస్తున్నారు. దీని బదులు ఏ మీసేవా సెంటర్‌లో పెట్టినా హాయిగా వెళ్లి సవరణలు చేసుకునే వారమని అంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, దాని చుట్టుపకల ఉన్న గేటెడ్ కమ్యూనిటీలు, శివారు కాలనీల్లో చాలామందికి ఫామ్‌లు అందనే లేదు. అధికారులు ఇండ్ల వద్దకు వచ్చి వివరాలు సేకరించకుండానే, ఆఫీసుల్లో కూర్చొని ఫామ్‌ల పంపిణీ అయిపోయినట్టు టిక్ మార్కులు పెట్టేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్ణీత గడువులోగా పక్రియ పూర్తి చేయాలనే పైఅధికారుల ఒత్తిడికి భయపడి క్షేత్రస్థాయి సిబ్బంది తూతూమంత్రంగా పని కానిచ్చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సర్ నిబంధనల ప్రకారం బీఎల్‌ఓలు మూడుసార్లు ఓటర్ల ఇళ్లకు వెళ్లాలన్న నియమం ఉన్నా కనీసం ఒక్కసారి కూడా క నిపించకుండానే పోతున్నారు. నగరాలు, పట్టణాల్లో ని అనేక కాలనీల్లో బిఎల్‌వోలు సందర్శించిన ప్రాంతాలు వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఒక్కసారి కూడా రాని ప్రాంతాలు వందల్లో ఉంటాయి. అయినా అంతా సజావుగా సాగుతోందని ఎన్నికల కమిషన్ గొప్పగా చెప్పుకుంటోది. ప్రజలందరి చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉండి, సామాజిక మాధ్యమం నిఘా విస్తృతంగా ఉన్న నేపథ్యంలో బీఎల్‌ఓలు ఒక్కచోటే కూర్చొని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న దృశ్యాలు వందలు

కనపడుతున్నాయి. ఇపూర్తిచేసిన ఫారాలను కూడా ఓటర్లే మళ్లీ బీఎల్‌ఓల వద్దకు వెళ్లి సమర్పించుకునే పరిస్థితే చాలా చోట్ల ఉంది. సర్ పక్రియ దరిద్రంగా సాగుతోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అవసరం లేదు. గతంలో బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ప్రజలు గగ్గోలు పెడుతుంటే ..ఇక్కడ ఉన్నవారికి అదో వింతగా అనిపించింది. కానీ ఇప్పుడు మనకు అనుభం కావడంతో అసలు ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రక్రియ ఇలాగే సాగితే తెలుగు రాష్ట్రాల్లో కనీసం 50 శాతం ఓట్లు గల్లంతు కావడం ఖాయం. ఆషామాషీగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదు చేయకూడదు. అలాగే తొలగించడం కూడా సరికాదు. ఆధార్ కార్డును ఓటరుగా గుర్తించేందుకు ఉపయోగ పడదని ఇప్పటికే ఇసి తేల్చి చెప్పింది. ఆధార్ కార్డు ప్రామాణికం కాదనే వాదన ఎంత లోపభూయిష్ఠమో అర్థం చేసుకోవాలి. నిజానికి ఓటు నమోదు, తొలగింపే ఓ ప్రహసనంగా మారడం విడ్డూరంగా ఉంది. పక్కాగా ఓటరు కార్డును తయారు చేయలేని దౌర్భాగ్యస్థితిలో ఎన్నికల సంఘం ఉంది. సరిహద్దులను దాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవాళ్లు ఆధార్ కార్డులు పొందివుంటే ..దానిని గుర్తించి ఏరివేయాలి. ఓటరు జాబితాలోచనిపోయిన వారితో పాటు రెండుచోట్ల ఓట్లున్న వారి పేర్లూ ఉన్నాయంటే అందుకు ఎన్నికల సంఘం సక్రమ నిర్వహా లోపమే కారణం. సరైన టెక్నాలజీని వాడడం లేదు. ఎన్నో ఐటి కంపెనీలు ఉన్నాయి. వారికి అప్పగిస్తే ఎలా ఓటు నమోదు చేయాలో, దానికి ఎలా పర్మినెంట్ నంబర్ ఉండాలో చెబుతారు. బిఎల్‌వోలు ఇంటింటికీ తిరగకుండా గ్రామస్థాయిలో పంచాయితీల సహకారం తీసుకోవాలి. పట్టణాల్లో వార్డుస్థాయి అధికారుల సహాయం తీసుకుంటే బాగుండేది. రకరకాల కారణాలతో కొరతలతో దాదాపు కోటిమంది 11 రకాల డాక్యుమెంట్లలో ఏదో ఒకదాన్ని సమర్పించి తమనితాము అసలైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. ఈ తంతు మొత్తం తలనొప్పిగా ఉందే తప్ప సజావుగా ఓటను పదిలపర్చుకునేలా లేదు. ఇలాంటి తలనొప్పులను అధికారులు గుర్తించడం లేదు. అది ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం.

## బద్రీనాథ్ ఆలయ విరాళాల లెక్కింపులో అక్రమాలు

**సస్పెండ్ అయిన అధికారి ప్రమోద్ నౌటియాల్ అరెస్ట్**

న్యూఢిల్లీ,జూలై14 బద్రీనాథ్ ఆలయ విరాళాల లెక్కింపులో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో ఉత్తరాఖండ్ పోలీసులు బద్రీనాథ్ - కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ చైర్మన్ మాజీ వ్యక్తిగత సహాయకుడు , సస్పెండ్ అయిన అధికారి ప్రమోద్ నౌటియాల్‌ను అరెస్ట్ చేశారు. డెహ్రాడూన్‌లోని అతడి నివాసంలో చమోలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం అతడిని బద్రీనాథ్‌కు తరలించారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చి పోలీసు కస్టడీ కోరనున్నట్లు అధికారులు తెలిపారు. జులై 2వ తేదీన ఆలయ కానుకల లెక్కింపు సమయంలో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు, ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు విచారణ ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీ పరిశీలనలో ప్రమోద్ నౌటియాల్ నగదు లెక్కింపు గది నుంచి తన వ్యక్తిగత కార్యాలయానికి పలుమార్లు వెళ్లినట్లు గుర్తించారు. ఈ కేసు విచారణలో రూ.500, రూ.100 నోట్ల కట్టలు, బంగారు, వెండి నాణెళిలు, శాలిగ్రామ శిలలను దాచిపెట్టినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. ఆలయ విరాళాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను, పద్ధతులను పూర్తిగా ఉల్లంఘించినట్లు ఃఐ÷ుఅ అంతర్గత నివేదికలో కూడా ప్రాథమికంగా పేర్కొంది. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ క్రమంలోనే గర్వాల్ డివిజనల్ కమిషనర్ నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో ఉన్నతస్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసి పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా, కేదార్‌నాథ్ ఆలయ నిధుల వినియోగంలోనూ అక్రమాలు వెలుగుచూశాయి. వీఐపీల వసతి, భోజనాల పేరిట నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో మాజీ మేనేజర్, ఇన్‌చార్జ్ అధికారి, మాజీ సీఈఓలపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఆదేశించింది. మరోవైపు తన సస్పెన్షన్, ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తూ ప్రమోద్ నౌటియాల్ ఉత్తరాఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ జులై 16వ తేదీన జరగనుంది.

## చైనాను వణికిస్తున్న టైఫూన్ బావి

**వరదనీటిలో కార్లు కొట్టుకుపోయిన దృశ్యాలు**

బీజింగ్,జూలై14 : చైనాను టైఫూన్ బావి వణికిస్తోంది. భారీ వర్షాలతో.. రహదారులు జలమయంగా మారాయి. లియావోనింగ్ ప్రావిన్స్‌లోని 2,60,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరదనీటిలో కార్లు బొమ్మల్లా కొట్టుకుపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మంగళవారం కూడా భారీ వర్షాలకు అవకాశం ఉందని చైనా జాతీయ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. 13 రోజుల క్రితం పసిఫిక్ సముద్రంలో ఏర్పడిన ఈ టైఫూన్ ఫ్రాన్స్ దేశమంతా విస్తీర్ణాన్ని కలిగి ఉంది. దీని ప్రభావం జపాన్, తైవాన్, ఫిలిప్పీన్స్, ఉత్తర కొరియాలోనూ కనిపిస్తోంది.

## లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్

**పహల్గామ్ ఉగ్రదాడి కేసులో ఎన్ఐఎ విచారణ**

శ్రీనగర్,జూలై14 జమ్మూకశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడి కేసులో లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌పై స్పెషల్ ఎన్ఐఏ కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జులై 8వ తేదీన కోర్టు హాఫీజ్ సయీద్‌పై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేయగా.. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పహల్గాం దాడిపై విచారణ జరుపుతున్న నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) జులై 6వ తేదీన ఈ కేసుకు సంబంధించి స్పెషల్ ఎన్ఐఏ కోర్టులో అనుబంధ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ ఎల్ఈటీ అధినేత హాఫీజ్ సయీద్‌పై పలు అభియోగాలతో ఈ అనుబంధ చార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. సయీద్‌పై ఉపా చట్టంతో పాటు భారతీయ న్యాయసంహితలోని పలు సెక్షన్ల కింద ఎన్ఐఏ కేసు నమోదు చేసింది. జులై 8వ తేదీన ఎన్ఐఏ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను కోర్టు పరిశీలించింది. ప్రాథమికంగా నిందితుడిపై మోపిన అభియోగాలకు తగిన ఆధారాలు ఉన్నాయని భావించి, కేసును విచారణకు స్వీకరించింది. నిందితుడిపై నాన్-బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. పాకిస్థాన్‌లో ఉన్న సయీద్ ఇండియాకు రాకపోయినప్పటికీ విచారణ కొనసాగనుంది. 2024లో అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టం 'భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-2023'లోని సెక్షన్ 356 ప్రకారం.. నిందితుడు అందుబాటులో లేకపోయినా అతనిపై విచారణ జరిపి శిక్ష వేయవచ్చు. దీన్నే 'ట్రయల్ ఇన్ అబ్సెన్షియా' అంటారు.

## పంజాబ్‌లో ప్రైవేట్ స్కూళ్లకు షాక్

**పెంచిన ఫీజులను వాపస్ చేయాలని సర్కార్ హుకుం**


చండీఘడ్,జూలై14 పంజాబ్‌లోని ప్రైవేట్ స్కూళ్లకు అక్కడి ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. గత మూడేళ్లుగా రాష్ట్రంలో ఏటా 5 శాతానికి పైగా ఫీజులు పెంచిన ప్రైవేట్ పాఠశాలలు.. ఆ అదనపు మొత్తాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తిరిగి చెల్లించాలని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు గత నాలుగేళ్ల ఫీజు రికార్డులను పది రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. ఆ సమాచారాన్ని విద్యాశాఖ పోర్టల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఫీజు చెల్లించలేదని మానసిక వేధింపుల కారణంగా ఇటీవల అమృత్‌సర్‌లో 17ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనను భగవంత్‌మాన్ ప్రస్తావించారు. ఈ ఘటన తర్వాత, అధిక ఫీజుల పెంపుపై తల్లిదండ్రుల నుంచి అనేక ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ పాఠశాలల (ఖసతిలజీబి ÷ుఇఠనీనీబె)పై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఆర్డినెన్స్‌ను కోర్టులో సవాలు చేసినా తాము చట్టపరంగా ముందుకు వెళ్తామని.. ఈ విషయంలో వెనుకడుగు వేసేదే లేదని స్పష్టం చేశారు. కొత్త ఆర్డినెన్స్ ప్రకారం.. ప్రైవేట్ పాఠశాలలు వార్షిక ఫీజులను 5శాతానికి మించి పెంచకూడదు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై రూ.50వేల నుంచి రూ.1 లక్షవరకు జరిమానా విధింపు, గుర్తింపు రద్దు వంటి చర్యలు తీసుకోనున్నారు. ఈ నిర్ణయం ద్వారా పంజాబ్‌లోని 32లక్షలకు పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రయోజనం పొందుతారని అంచనా.

## వేంకటేశ్వర స్వామిగా రాజేంద్రప్రసాద్

రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'మిస్టర్ మిడిల్ క్లాస్' . జి.నాగేశ్వరరావు దర్శకత్వం వహించిన ఈ సినిమా జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో వేంకటేశ్వర స్వామిగా రాజేంద్రప్రసాద్ నటించగా.. భక్తుడిగా శ్రీకాంత్ కనిపించనున్నారు.

## తదుపరి ప్రాజెక్టులపై నాగచైతన్య దృష్టి

### సోషల్ మీడియా ప్రచారాలను తిప్పికొట్టిన టీమ్




అక్కినేని నాగచైతన్య తదుపరి ప్రాజెక్టులపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. అధికారిక ప్రకటన ఏదీ లేకపోయినా, ఆయన కొత్త సినిమాల లైనప్ గురించి ఎంటర్‌టైన్‌మెంట్ పేజీలు, సినీ వర్గాలకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో వరుస పోస్టులు దర్శనమివ్వ డంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఇద్దరు కొత్త దర్శకులతో చైతన్య సినిమాలు చేయబోతున్నారనే ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న నాగచైతన్య, ఆ తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్‌లో నటించనున్నట్లు ప్రచారం జరిగింది. మసూద చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి కిరణ్ చెప్పిన కథను చైతన్య ఇప్పటికే విన్నారని, ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొట్టాయి. కథ నచ్చడంతో కేవలం తుది నిర్ణయం మాత్రమే మిగిలి ఉందని కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అంతేకాకుండా బెదురులంక దర్శకుడు క్లాక్స్ దర్శకత్వంలోనూ నాగచైతన్య ఓ కొత్త కాన్సెప్ట్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. 'వృషకర్మ' షూటింగ్ పూర్తయ్యాక ఈ ఏడాది చివర్లో ఆ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని పలు కథనాలు పేర్కొన్నాయి. వరుసగా ఇద్దరు కొత్త తరహా దర్శకుల పేర్లు వినిపించడంతో అభిమానులు ఈ ప్రాజెక్టులపై ఆసక్తి చూపడం ప్రారంభించారు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి నాగచైతన్య టీమ్ స్పష్టత ఇచ్చింది. మసూద దర్శకుడు సాయి కిరణ్‌తో సినిమా ఖరారైందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని వెల్లడించింది. ఇప్పటివరకు ఇద్దరి మధ్య స్క్రిప్ట్ చర్చలు గానీ, అధికారిక సమావేశాలు గానీ జరగలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. అలాగే క్లాక్స్‌తో సినిమా విషయంలో కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కొత్త దర్శకుల నుంచి కథలు వింటున్న మాట నిజమే అయినప్పటికీ, ఏ ప్రాజెక్ట్‌కూ ఇంకా తుది ఆమోదం ఇవ్వలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

## తుంబాడ్-2 లో ఆలియా భట్



భారతీయ చలనచిత్ర రంగంలో అద్భుతమైన విజువల్స్, అద్భుతమైన కథాంశంతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'తుంబాడ్'. ఈ సినిమా సీక్వెల్ 'తుంబాడ్ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్ర పరిశ్రమలో ఒక భారీ సంచలన అప్‌డేట్ వెలువడింది. బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ అధికారికంగా 'తుంబాడ్ 2' చిత్రబృందంలో చేరింది. ఈ విషయాన్ని సినిమా హీరో మరియు నిర్మాత సోహుమ్ షా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.. 'తుంబాడ్ 2' లోకి స్వాగతం ఆలియా భట్. ప్రళయం రాబోతోంది‘ అంటూ సోహుమ్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆలియాతో దిగిన ఫోటోలను పంచుకున్నారు. ఈ సినిమాలో భాగం కావడంపై ఆలియా భట్ సైతం హర్షం వ్యక్తం చేసింది. తాను మొదటిసారి 'తుంబాడ్' చూసినప్పటి నుంచి ఆ చిత్రం తన మనసులోనే ఉండిపోయిందని, ఇంతటి ప్రత్యేకమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడానికి తాను ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు తెలిపింది. ఇక 'తుంబాడ్ 2' లో ఆలియా భట్ పాత్ర కేవలం అతిథి పాత్రగా కాకుండా కథను మలుపు తిప్పే కీలకమైన రోల్‌గా ఉండబోతోంది. దాదాపు రూ.100 కోట్ల భారీ బ్జడెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందు తున్న ఈ సీక్వెల్‌కు ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 3, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్ల లో విడుదల కానుంది.



## రావ్ బహద్దూర్ అందరూ చూడాల్సిన మూవీ

ప్రశంసలు కురిపించిన దర్శకుడు సందీప్ వంగా

ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇటీవలే విడుదలైన 'రావ్ బహదూర్' చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా తన రివ్యూను పంచుకున్నారు. సినిమాను గొప్పగా తీసిన చిత్ర బృందాన్ని అభినందించారు. మనం సినిమాను ఎందుకు అంతగా ప్రేమిస్తామో మరోసారి గుర్తుచేసే అరుదైన చిత్రాల్లో 'రావు బహదూర్' ఒకటి. సినిమా ప్రేమికుడికి నాదొక చిన్న విన్నపం.. మీ జీవితంలోని మూడు గంటల సమయాన్ని 'రావ్ బహదూర్'కు ఇవ్వండి. కచ్చితంగా మీకు నచ్చుతుంది. అన్ని ప్రశంసలు అందుకునేందుకు దీనికి పూర్తి అర్హత ఉంది. వెంకటేశ్ మహా తక్కువ బ్జడెట్‌లో అద్భుతంగా రూపొందించారు. ఎంతో ధైర్యం, తనపై తనకు బలమైన నమ్మకం ఉన్న వాళ్లు మాత్రమే ఇలా తెరకెక్కించగలరు. ఇక సత్యదేవ్ తన నటనతో అదరగొట్టారు. ఇందులో ఎలాంటి అనవసరమైన హడావుడి లేదు, షార్ట్‌కట్‌లు లేవు. కేవలం స్వచ్ఛమైన కథ మాత్రమే కనిపిస్తుంది‘ అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇలాంటి సినిమాలను కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలని అన్నారు.







## జపాన్‌లో తేలిపోయిన దురంధర్

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధురంధర్' ప్రపంచవ్యాప్తంగా మంచి విజయాన్ని అందుకున్నప్పటికీ, జపాన్ బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆశించిన ఆరంభాన్ని నమోదు చేయలేక పోయింది. ఈ ఫ్రాంచైజీకి ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా భారీ ఆదరణ లభించగా, రెండు భాగాలు కలిపి రూ.3,100 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి రికార్డులు సృష్టించాయి. అయితే జపాన్ మార్కెట్‌లో మాత్రం ఈ సినిమా ప్రారంభ కలెక్షన్లు నిరాశ కలిగించాయి. జూలై 10న జపాన్‌లో సుమారు 80 స్క్రీన్‌లలో గ్రాండ్‌గా విడుదలైన 'ధురంధర్'కు విడుదలకు ముందు భారీ స్థాయిలో ప్రచారం నిర్వహించారు. రణవీర్ సింగ్ అభిమానులతో పాటు భారతీయ సినీ ప్రేమికులు కూడా ఈ సినిమాపై మంచి అంచనాలు పెట్టుకున్నారు. కానీ ఆ అంచనాలకు తగ్గట్టుగా ప్రేక్షకాదరణ లభించలేదు. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, విడుదలైన తొలి రోజు మధ్యాహ్నం 2 గంటల వరకు 57 థియేటర్లలో ఈ చిత్రాన్ని కేవలం 449 మంది ప్రేక్షకులు మాత్రమే వీక్షించారు. సాయంత్రం, రాత్రి షోలతో కలిపినా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించలేదు. మొత్తం తొలి రోజు 80 స్క్రీన్‌లలో కేవలం 900 టికెట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. ఈ కలెక్షన్లతో వారాంతంలో జపాన్ బాక్సాఫీస్ టాప్-25 చిత్రాల జాబితాలో కూడా 'ధురంధర్' స్థానం సంపాదించలేకపోయిందని తెలుస్తోంది. ఆసక్తికర విషయం ఏమిటంటే, ఇటీవల జపాన్‌లో విడుదలైన 'పుష్ప 2' కూడా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఆ చిత్రం తొలి రోజు 886 టికెట్లు మాత్రమే విక్రయించగా, 'ధురంధర్' 900 టికెట్లతో స్వల్పంగా మెరుగైన ఆరంభాన్ని నమోదు చేసింది. అయితే ఈ రెండు చిత్రాలు కూడా అక్కడ భారీ ఓపెనింగ్ సాధించలేకపోవడం విశేషం.



# తండ్రి విజయ్ కోసం సంజయ్ త్యాగం

### జననాయగన్ కోసం సిగ్మా మూవీ వాయిదా


విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ 'సిగ్మా'తో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయ్ సినిమా కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జన నాయగన్' జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏడు నెలల నిరీక్షణ అనంతరం వస్తోన్న ఈ సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దీనికి లైన్ క్లియర్ చేయడం కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకుంటున్నారని సమాచారం.

సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందిన 'సిగ్మా' చిత్రాన్ని జులై 31న విడుదల చేయాలని మొదట భావించారు. 'జన నాయగన్' జులై చివరి వారంలో వస్తుండటంతో.. ఈ సినిమా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు సమాచారం. గతంలో సంజయ్ ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ఇది తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని చెప్పారు. ఆగస్టులో పెద్ద సినిమాలేవీ లేకపోవడంతో అప్పుడు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక అప్‌డేట్ రావాల్సి ఉంది. ఇక విజయ్ కుమారుడు సంజయ్‌కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం దర్శకుడిగానే కాకుండా త్వరలోనే నటుడిగా కూడా వెండితెరకు పరిచయం కానున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాత జీకేఎమ్ తమిళ్ కుమారన్ తన సొంత బ్యానర్‌పై సంజయ్‌ను హీరోగా పరిచయం చేయనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. విజయ్ సినిమాల నుంచి వైదొలగిన నేపథ్యంలో ఆయన కుమారుడు వెండితెరకు పరిచయం కానున్నట్లు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.









## ఇంగ్లాండ్ నయా ఓపెనర్ గా జాకబ్ బెథెల్ ప్రమోషన్..

ఇండియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగబోయే త్రీ-మ్యాచ్ వన్డే సిరీస్ కోసం క్రేజీ సమరానికి టైమ్ ఫిక్స్ అయింది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా మంగళవారం జరగబోయే ఫస్ట్ వన్డే మ్యాచ్ కోసం హోస్ట్ టీమ్ ఇంగ్లాండ్ తమ స్ట్రాంగ్ ప్లేయింగ్ ఎలెవన్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేసింది. ఈ మ్యాచ్ లో యంగ్ అండ్ డైనమిక్ ఆల్‌రౌండర్ జాకబ్ బెథెల్, సీనియర్ బ్యాటర్ బెన్ డకెట్‌తో కలిసి ఓపెనర్ గా బరిలోకి దిగబోతున్నట్లు మేనేజ్‌మెంట్ కన్ఫర్మ్ చేసింది. ఈ మ్యాచ్ ఇంగ్లాండ్ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ జోస్ బట్లర్ కెరీర్ లో ఒక మైండ్ బ్లాకింగ్ పర్సనల్ మైల్‌స్టోన్ గా నిలవబోతోంది. బట్లర్ తన ఇంటర్నేషనల్ కెరీర్ లో 200వ వన్డే మ్యాచ్ ఆడబోతున్నాడు. ఇంగ్లాండ్ వైట్ బాల్ సెటప్ లో మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ అయిన జోస్ బట్లర్, ఫిబ్రవరి 21, 2012 న దుబాయ్ వేదికగా పాకిస్తాన్‌పై తన ఫస్ట్ వన్డే డెబ్యూ ఇచ్చాడు. అప్పటి నుంచి ప్రెజెంట్ వరకు వన్డే ఫార్మాట్ లో 39.11 యావరేజ్ తో ఏకంగా 5,515 రన్స్ స్కోర్ చేశాడు. ఇందులో 11 సెంచరీలు, 29 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ 200వ మైలురాయిని అందుకోబోతున్న బట్లర్, ఈ హిస్టారికల్ మ్యాచ్ లో ఇండియాపై ఒక సంచలన ఇన్నింగ్స్ ఆడి తన మార్క్ చూపించాలని ఫుల్ జోష్ తో ఉన్నాడు. ఇప్పటివరకు 21 వన్డే మ్యాచులు ఆడిన జాకబ్ బెథెల్ కు టాప్ ఆర్డర్ లో ప్రమోషన్ ఇవ్వడం ద్వారా బెన్ డకెట్‌కు ఒక పర్మనెంట్ ఓపెనింగ్ పార్ట్‌నర్ ను సెట్ చేయాలని ఇంగ్లాండ్ భావిస్తోంది. రీసెంట్ టైమ్స్ లో డకెట్‌తో కలిసి ఓపెనింగ్ చేసిన ఫిఫ్త్ (ఐదో) పార్ట్‌నర్ గా బెథెల్ రికార్డుల్లోకి ఎక్కనున్నాడు. అంతకుముందు ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, జాక్ క్రాలీ, రెహాన్ అహ్మద్ లు ఓపెనర్లుగా ట్రై చేసినా సక్సెస్ కాలేదు. హ్యారీ బ్రూక్ లీడర్‌షిప్ లోని ఇంగ్లాండ్ టీమ్, ఇండియా సాలిడ్ బ్యాటింగ్ లైన్ అప్ ను కట్టడి చేయడానికి విల్ జాక్స్, లియామ్ డాసన్, అదిల్ రషీద్ లతో కూడిన స్పిన్-హెవీ బౌలింగ్ కాంబినేషన్ ను రంగంలోకి దించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ లతో స్ట్రాంగ్ గా ఉన్న ఇండియన్ బ్యాటింగ్ ను స్పిన్ తో తిప్పికొట్టడమే ఇంగ్లాండ్ ప్లాన్ అని తెలుస్తోంది.టీ20 సిరీస్ ను 4-0 తో క్లీన్ స్వీప్ చేసిన జోష్ లో ఉన్న ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్, లాస్ట్ నవంబర్ తర్వాత ఫస్ట్ టైమ్ వన్డే సెటప్ లోకి గ్రాండ్ గా కంబ్యాక్ ఇచ్చాడు. ఆర్చర్ తో పాటు జోష్ టంగ్ పేస్ బాధ్యతలు చూసుకోనుండటంతో గస్ అట్కిన్సన్ కు ప్లేయింగ్ ఎలెవన్ లో ప్లేస్ దక్కలేదు. ఎడ్జ్‌బాస్టన్ మ్యాచ్ తర్వాత కార్డిఫ్ (జూలై 16), లార్డ్స్ (జూలై 19) వేదికల్లో మిగతా మ్యాచులు జరగనున్నాయి. ఫస్ట్ వన్డే కోసం ఇంగ్లాండ్ అఫీషియల్ స్క్వాడ్ లో జాకబ్ బెథెల్, బెన్ డకెట్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), సామ్ కరన్, విల్ జాక్స్, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, జోష్ టంగ్, అదిల్ రషీద్ బరిలోకి దిగుతున్నారు.

# గెలుపు బాటలోకి.. తొలి వన్డేలో భారత్ విజయం

### అక్షర్ ఆల్‌రౌండ్ షో

### గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్

బర్మింగ్‌హామ్ : వరుసగా రెండు టీ20 సిరీస్ ఓటముల నైరాశ్యంలో ఉన్న భారత క్రికెట్ జట్టును వన్డే ఫార్మాట్ మళ్లీ విజయాల బాట పట్టించింది. ఇంగ్లండ్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా మంగళవారం బర్మింగ్‌హామ్‌లో జరిగిన తొలి వన్డేలో టీమిండియా.. 6 వికెట్ల తేడాతో నెగ్గి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. ప్రత్యర్థి నిర్దేశించిన 259 పరుగుల ఛేదనను భారత్.. 45.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. శుభ్‌మన్ గిల్ (75 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో 80 రిటైర్డ్ హర్ట్) కెప్టెన్ ఇన్నింగ్స్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అక్షర్ పటేల్ (52 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 57 నాటౌట్) ఆల్‌రౌండ్ మెరుపులకు తోడు వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్) రాణించాడు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. 47.5 ఓవర్లలో 258 రన్స్‌కు ఆలౌట్ అయింది. 80కే 5 కీలక వికెట్లు కోల్పోయిన దశలో ఆ జట్టును జో రూట్ (76 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 76 నాటౌట్), లియామ్ డాసన్ (83 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 68) ఆదుకున్నారు. బ్యాట్‌తో మెరిసిన అక్షర్.. బంతితో (4/62) నాలుగు వికెట్లు తీయగా ప్రసిద్ధ్ (2/50), యువ పేసర్ గుర్నూర్ బ్రార్ (2/61)కు తలా రెండు వికెట్లు దక్కాయి. ఈనెల 16న కార్డిఫ్‌లో రెండో వన్డే జరుగుతుంది.



### ముందు గిల్.. తర్వాత అక్షర్

రెండు బౌండరీలతో ఛేదనను మొదలెట్టిన సారథి గిల్.. సీనియర్లు రోహిత్ (11), కోహ్లీ (5) వెంటవెంటనే నిష్క్రమించినా కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెప్పించాడు. శ్రేయస్ (35) అండతో నిలకడగా ఆడాడు. వీలుచిక్కినప్పుడల్లా బంతిని బౌండరీకి తరలించిన అతడు.. కరన్ 20వ ఓవర్లో అర్ధ సెంచరీని పూర్తిచేసుకున్నాడు. అదిల్ ఓవర్లో రెండు ఫోర్లు బాదిన అతడు.. బెతెల్, జాక్స్‌నూ అలవోకగా ఎదుర్కొని శతకం దిశగా సాగాడు. మరో ఎండ్‌లో శ్రేయస్ అతడికి చక్కటి సహకారం అందించడంతో భారత్ లక్ష్యం వైపుగా కదిలింది. మూడో వికెట్‌కు వంద పరుగులు జోడించి ఛేదన వైపుగా సాగుతున్న సమయంలో గిల్ కుడికాలి గాయంతో ఇబ్బందిపడి మైదానాన్ని వీడాడు. ఇంగ్లండ్ దీనిని ఒక అవకాశంగా మలుచుకుని వరుసగా వికెట్లు పడగొట్టి పోటీలోకి వచ్చింది. ఆర్చర్ 27వ ఓవర్లో సింగిల్ తీసే క్రమంలో శ్రేయస్.. బ్రూక్ డైరెక్ట్ త్రోకు బలయ్యాడు. ఆ వెంటనే రాహుల్ (1) టంగ్ వేసిన బాల్‌ను వికెట్ల మీదకు ఆడుకుని క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అయితే అక్షర్, వాషింగ్టన్ మాత్రం ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లారు. ఈ జోడీ అభేద్యమైన ఐదో వికెట్‌కు 102 రన్స్ జోడించి మెన్ ఇన్ బ్లూను గెలుపుబాట పట్టించింది. బంతితో రాణించిన అక్షర్.. ఇంగ్లండ్ పేస్, స్పిన్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని వాషింగ్టన్ సహకారంతో లాంఛనాన్ని పూర్తిచేశాడు.

### 4 ఓవర్లు.. 5 వికెట్లు..

మొదట నెమ్మదిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇంగ్లండ్.. 13వ ఓవర్ తర్వాత ఒక్కసారిగా తడబడి 4 ఓవర్ల వ్యవధిలో 5 కీలక వికెట్లు కోల్పోయింది. జాకబ్ బెతెల్ (14) నిరాశపరిచినా బెన్ డకెట్ (43) ఉన్నంతసేపు వేగంగా ఆడాడు. గుర్నూర్‌ను లక్ష్యంగా చేసుకుని అతడి 8వ ఓవర్లో 4, 6, 6తో పాటు మరుసటి ఓవర్లో రెండు బౌండరీలు బాదాడు. కానీ 13వ ఓవర్లో మళ్లీ బౌలింగ్‌కు వచ్చిన గుర్నూర్.. నాలుగు బంతుల వ్యవధిలో ఓపెనర్లను వెనక్కి పంపి టీమిండియాకు బ్రేక్ ఇచ్చాడు. ఆ వెంటనే కెప్టెన్ హ్యారీ బ్రూక్ (1).. బుమ్రా ఓవర్లో స్లిప్స్ వద్ద రోహిత్‌కు క్యాచ్ ఇచ్చాడు. 17వ ఓవర్లో ప్రసిద్ధ్.. ఇంగ్లిష్ టీమ్‌ను మరో దెబ్బకొట్టాడు. తొలుత జోస్ బట్లర్ (5)ను బోల్తా కొట్టించిన అతడు.. నాలుగో బంతికి సామ్ కరన్‌ను డకౌట్ చేయడంతో బ్రూక్ సేన ఐదో వికెట్ కోల్పోయింది. కొద్దిసేపటికే విల్ జాక్స్ (20) సైతం దూబే బౌలింగ్‌లో కీపర్ రాహుల్ అందుకున్న సూపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. 22 ఓవర్లకు 107/6తో పీకల్లోతు కష్టాల్లో ఉన్న ఆతిథ్య జట్టును డాసన్‌తో కలిసి రూట్ ఆదుకున్నాడు. ఈ ఇద్దరూ అనవసరపు షాట్లకు పోకుండా సింగిల్స్, డబుల్స్‌తో ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించి ఏడో వికెట్‌కు 121 రన్స్ జోడించారు. అయితే అక్షర్ పటేల్ చివరి నాలుగు వికెట్లు పడగొట్టి ఆతిథ్య జట్టును తక్కువ స్కోరుకే పరిమితం చేశాడు.

150 వన్డేల్లో బుమ్రా 150 వికెట్ల క్లబ్‌లో చేరాడు. అలాగే, ఇంగ్లండ్ గడ్డపై అత్యధికంగా 31 వికెట్లు తీసిన భారత బౌలర్‌గా జడేజా (30) రికార్డును బ్రేక్ చేశాడు.

# యువ ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో భారత క్లబ్‌లు అద్భుత ప్రదర్శన

### పంజాబ్ ఎఫ్‌సీకి 5-0 భారీ విజయం





జపాన్‌లో జరుగుతున్న యువ ఫుట్‌బాల్ మ్యాచ్‌లలో భారత అభివృద్ధి జట్లు (డెవలప్‌మెంట్ స్క్వాడ్స్) ఆకట్టుకునే ప్రదర్శన కనబర్చాయి. జూలై 14, 2027న కురాటే (జపాన్) వేదికగా జరిగిన పోటీల్లో భారత క్లబ్‌లు జపాన్ జే-లీగ్‌కు చెందిన జట్లతో తలపడగా, రెండు జట్లు విజయాలు నమోదు చేయగా, మరో జట్టు త్రుటిలో ఓటమి చవిచూసింది. రోజంతా జరిగిన మ్యాచ్‌ల్లో అత్యంత ఏకపక్ష విజయాన్ని పంజాబ్ ఎఫ్‌సీ నమోదు చేసింది. అవిస్పా ఫుకుఓకాపై 5-0 తేడాతో ఘన విజయం సాధించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మ్యాచ్ ప్రారంభమైన మూడు నిమిషాల్లోనే సింగమయుమ్ షామి తొలి గోల్ నమోదు చేయగా, 28వ నిమిషంలో మరోసారి గోల్ చేసి జట్టుకు బలమైన ఆధిక్యం అందించాడు. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 42వ నిమిషంలో ఒమాంగ్ డోడుమ్ మరో గోల్ సాధించాడు. రెండో అర్ధభాగంలో 55వ నిమిషంలో నగారిన్ షైజా స్కోరు పెంచగా, ఇంజరీ టైమ్ (90ం2)లో విశాల్ యాదవ్ ఐదో గోల్ చేసి పంజాబ్ ఎఫ్‌సీ విజయాన్ని మరింత ఘనంగా నిలిపాడు. మరో ఆసక్తికర మ్యాచ్‌లో బెంగళూరు ఎఫ్‌సీ 3-2 తేడాతో గిరావాంజ్ కిటాక్యూషుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో 40వ నిమిషంలో ర్యునోసుకే ఇమై గోల్ చేయడంతో జపాన్ జట్టు ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే రెండో అర్ధభాగంలో బెంగళూరు ఎఫ్‌సీ అద్భుతంగా పుంజుకుంది. 61వ నిమిషంలో రక్షిత్ రక్షిత్ ప్రియా అనిల్ సమం చేసే గోల్ నమోదు చేశాడు. ఒక స్వీయ గోల్ కారణంగా మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారినప్పటికీ, 75వ నిమిషంలో సెర్టో వోర్నిలెన్ కోమ్ కీలక గోల్ సాధించాడు. చివరి నిమిషాల్లో జట్టు సమిష్టి రక్షణ ఆకట్టుకోగా, 90వ నిమిషంలో ఎండీ అర్బాష్ గోల్ చేసినప్పటికీ బెంగళూరు ఎఫ్‌సీ విజయాన్ని కాపాడుకుంది. మరో మ్యాచ్‌లో ఎఫ్‌సీ గోవా జపాన్‌కు చెందిన సాగన్ టోసుతో హోరాహోరీగా పోరాడినా 1-0 తేడాతో ఓటమి పాలైంది. మ్యాచ్ ఆరో నిమిషంలోనే జెన్ర్యూ ఓనో చేసిన గోల్ ఆతిథ్య జట్టుకు విజయాన్ని అందించింది. ఆ తర్వాత ఎక్కువసేపు బంతిపై ఆధిపత్యం ప్రదర్శించిన గోవా, రెండో అర్ధభాగంలో పలు అవకాశాలు సృష్టించినా వాటిని గోల్స్‌గా మలచలేకపోయింది. జపాన్ జట్టు క్రమశిక్షణతో కూడిన రక్షణను ఛేదించడంలో విఫలమవడంతో గోవా ఖాళీ చేతులతో మ్యాచ్ ముగించింది.

# రెండో వన్డేలో విండీస్‌ను ఓడించిన న్యూజిలాండ్



రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచిన న్యూజిలాండ్ ఐదు వన్డేల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. కివీస్ ఎడమచేతి వాటం స్పిన్నర్ జేడెన్ లెనాక్స్ అద్భుత ప్రదర్శనతో వెస్టిండీస్ కుప్పకూలింది. లెనాక్స్ 19 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో కరేబియన్ జట్టు 138 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం న్యూజిలాండ్ 104 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. వెస్టిండీస్‌లోని గయానా వేదికగా జరిగిన మ్యాచ్‌లో తొలుత వెస్టిండీస్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు రాణించడంతో విండీస్ ఓ దశలో 10.3 ఓవర్లకు 63/0తో నిలిచింది. ఇక్కడే అసలు కథ మొదలైంది. లెనాక్స్ అద్భుతమైన బౌలింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. 8 ఓవర్లలో 19 రన్స్ ఇచ్చి.. 5 వికెట్లు తీశాడు. దీంతో ఆతిథ్య జట్టు కేవలం 75 పరుగుల వ్యవధిలో 10 వికెట్లు కోల్పోయి 138 పరుగులకే ఆలౌట్ అయింది. వెస్టిండీస్ బ్యాటర్లలో జాన్ క్యాంప్‌బెల్ 43 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. వెస్టిండీస్ కేవలం 10 ఓవర్లలోనే తమ చివరి 5 వికెట్లు కోల్పోయింది. 31 ఏళ్ల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన లెనాక్స్.. తన ఏడో వన్డేలో కెరీర్‌లో తొలిసారిగా ఐదు వికెట్ల ప్రదర్శనను నమోదు చేశాడు. ఎనిమిది ఓవర్లలో 19 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో వన్డే క్రికెట్‌లో న్యూజిలాండ్ స్పిన్నర్లలో మూడో అత్యుత్తమ బెస్ట్ నమోదు చేశాడు. ఎక్కువగా టర్న్ అవుతున్న పిచ్‌పై న్యూజిలాండ్ బ్యాటర్లు కూడా ఇబ్బంది పడ్డారు. 96 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది కివీస్. ఈ సమయంలో టామ్ లాథమ్ 37 రన్స్‌తో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. మైకెల్ బ్రేస్ వెల్ (24) కూడా రాణించడంతో న్యూజిలాండ్.. 32.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి.. ఛేజ్ పూర్తి చేసింది. వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లలో న్యూజిలాండ్‌కు ఇది 400వ విజయం కావడం గమనార్హం. ఐదు మ్యాచుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్ ఏడు వికెట్ల తేడాతో గెలుపొందగా, న్యూజిలాండ్ తాజా విజయంతో సిరీస్ 1-1తో సమమైంది. మూడో వన్డే జులై 17న గయానా వేదికగా జరగనుంది. గయానా వేదికగా జరిగిన రెండో వన్డేలో వెస్టిండీస్‌పై న్యూజిలాండ్ ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. కివీస్ స్పిన్నర్ ఐదు వికెట్లతో చెలరేగడంతో ఈ మ్యాచ్ గురించి తెలుసుకోవడానికి భారత క్రికెట్ అభిమానులు ఆసక్తి కనబర్చారు. దీంతో కీవర్డ్ 2 లక్షలకుపైగా సెర్చ్ వాల్యూమ్‌తో గూగుల్ ట్రెండ్స్‌లో టాప్‌లో నిలిచింది.

# కెప్టెన్సీలో ధోని రికార్డును సమం చేసిన శ్రేయస్ అయ్యర్



టి20 ప్రపంచకప్ 2026 నెగ్గిన తర్వాత నుంచి భారత జట్టుకు దరిద్రం పట్టుకున్నట్లు ఉంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో జరిగిన టి20 సిరీస్‌ల్లో భారత జట్టు ఘోర పరభవాన్ని మూటగట్టుకుంది. మొత్తం 7 మ్యాచ్‌లు జరిగితే.. ఆరింటిలో ఓడింది. మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. ఈ రెండు పర్యటనల్లో భారత జట్టు ఏ మాత్రం ఫైటింగ్ చేయలేకపోయి ంది. చివరికి ఐర్లాండ్ చేతిలో కూడా ఘోరంగా ఓడింది. తొలిసారి ఐర్లాండ్ చేతిలో సిరీస్‌ను కోల్పోయింది. టి20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత భారత జట్టులో మార్పులు జరిగాయి. సూర్యకుమార్ యాదవ్‌పై వేటు పడింది. ఫలితంగా శ్రేయస్ అయ్యర్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పజెప్పారు. ఈ క్రమంలో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ధోని రికార్డును సమం చేశాడు. భారత కెప్టెన్‌గా ఒక్క మ్యాచ్ గెలవని శ్రేయస్ అయ్యర్.. ధోని రికార్డును సమం చేయడం ఏంటంటూ మీరు ఆశ్చర్యపోవచ్చు. అయితే అది నిజం. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో భారత జట్టు 7 టి20లను ఆడింది. ఇందులో ఒక మ్యాచ్ రద్దు కాగా.. మిగిలిన 6 మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. అయితే ఈ 7 మ్యాచ్‌ల్లోనూ టాస్ శ్రేయస్ అయ్యరే గెలిచాడు.వరుసగా 7 టాస్‌లు గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గతంలో భారత జట్టు వరుసగా టాస్‌లను ఓడిపోయింది. గతేడాది జరిగిన ఆసియా కప్‌లో అయితే సూర్యకుమార్ యాదవ్ టాస్ గెలవడం కోసం లెఫ్టాండ్ తో కూడా స్పిన్ చేశాడు. కానీ, ఓడాడు. అయితే శ్రేయస్ అయ్యర్ మాత్రం కెప్టెన్‌గా 7 టాస్‌ల్లోనూ గెలిచాడు.గతంలో మహేంద్ర సింగ్ ధోని వరుసగా 7 సార్లు టాస్ నెగ్గాడు. ఆ తర్వాత మరో భారత కెప్టెన్ ఇలా చేయలేకపోయాడు. తాజాగా శ్రేయస్ అయ్యర్ ఈ ఘనతను అందుకున్నాడు. అయితే భారత కెప్టెన్‌గా ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్‌లో కూడా విజయం సాధించలేకపోయాడు.టి20 సిరీస్‌లో ఘోర ఓటమి తర్వాత భారత జట్టు వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. మంగళవారం నుంచి ఆరంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఇంగ్లండ్‌ను ఎదుర్కోనుంది. అయితే ఈ సిరీస్ కోసం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ ప్రీత్ బుమ్రా, శుబ్‌మన్ గిల్‌లు భారత జట్టులోకి రానున్నారు. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్ కోసం ఈ సిరీస్‌తో సన్నాహకాలు ఆరంభం కానున్నాయి.

# అర్జెంటీనాకు ఇంగ్లండ్ సవాల్..

### నేడు ఇంగ్లిష్ టీమ్‌తో మెస్సీసేన సెమీస్ పోరు

అర్ధరాత్రి 12.30 నుంచి యునైట్8 స్పోర్ట్స్, జీ5లో లైవ్

అట్లాంటా : ఫిఫా ప్రపంచకప్‌లో వరుసగా రెండోసారి విజేతగా నిలవాలని ఆశిస్తున్న లియోనల్ మెస్సీ కెప్టెన్సీలోని అర్జెంటీనా అతి పెద్ద సవాల్‌ను ఎదుర్కోనుంది. బుధవారం అర్ధ రాత్రి జరిగే రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా..బలమైన ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. సాకర్ సామ్రాజ్యంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ రెండు జట్లు వరల్డ్‌కప్‌లో 21 ఏండ్ల తర్వాత మళ్లీ ముఖాముఖి తలపడుతుండటంతో ఈ మ్యాచ్‌పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ టోర్నీలో ఇంగ్లండ్ ఇప్పటివరకు ఓటమి ఎరుగకుండా దూసుకుపోతోంది. నాకౌట్ దశలో కాంగో, సహ ఆతిథ్య జట్టు మెక్సికో, నార్వేపై విజయాలు సాధించి సెమీస్‌లో అడుగుపెట్టింది.



ఆ జట్టు కెప్టెన్ హ్యారీ కేన్ ఆరు గోల్స్ సాధించగా, మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ కూడా ఆరు గోల్స్, ఒక అసిస్ట్‌తో సూపర్ ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు, డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా ప్రతి మ్యాచ్‌లోనూ తీవ్రంగా శ్రమించి సెమీస్‌కు వచ్చింది. గ్రూప్-జె లో అగ్రస్థానంలో నిలిచిన ఆ జట్టు.. నాకౌట్ రౌండ్లలో కాబో వెర్డె, ఈజిప్ట్‌ను ఓడించేందుకు చెమటోడ్చింది. క్వార్టర్ ఫైనల్లో స్విట్జర్లాండ్‌పై ఎక్స్‌ట్రా టైమ్‌లో 3-1తో విజయం సాధించింది. అర్జెంటీనాను కెప్టెన్ లియోనల్ మెస్సీ ముందుండి నడిపిస్తున్నాడు. ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ చేసిన మెస్సీ.. ఈ టోర్నీలో ఇప్పటివరకు 8 గోల్స్, రెండు అసిస్ట్‌లు సాధించాడు. ఇక, ముఖాముఖిలో అర్జెంటీనాపై ఇంగ్లండ్‌దే పైచేయి కావడం మెస్సీ అభిమానులను కాస్త ఆందోళనపరిచే విషయం. ఇరు జట్ల మధ్య ఇప్పటివరకు 14 మ్యాచ్‌లు జరగ్గా.. ఇంగ్లండ్ ఆరుసార్లు నెగ్గితే.. అర్జెంటీనా 3 మ్యాచ్‌ల్లోనే విజయం సాధించింది.మరి, ఈసారి ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి.

# భారత అసిస్టెంట్ కోచ్ దష్కటే ఔట్!

### జట్టును వీడే యోచనలో ర్యాన్

బర్మింగ్‌హామ్ : టీమిండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ దష్కటే జట్టును వీడే యోచనలో ఉన్నాడు. కోచ్‌గా రెండేండ్ల కాంట్రాక్టు పూర్తవడంతో ఇంగ్లండ్‌తో ఈ నెల 19న ముగిసే చివరి వన్డే తర్వాత కోచింగ్ బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు తనను రిలీవ్ చేయాలని బీసీసీఐకి సమాచారం ఇచ్చాడు. బోర్డు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఓకే చెబితే మూడో వన్డే తర్వాత ర్యాన్ జట్టుకు వీడ్కోలు పలకనున్నాడు. ముగ్గురు కొడుకుల తండ్రి అయిన దష్కటే వ్యక్తిగత కారణాలతోనే కోచ్ పోస్టు నుంచి తప్పుకుంటున్నట్టు బోర్డుకు సమాచారం అందించాడు. నెదర్లాండ్స్ మాజీ క్రికెటర్ అయిన ర్యాన్ కుటుంబం లండన్‌లో నివాసం ఉంటుంది. తన కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించేందుకు భారత జట్టు కోచింగ్ బాధ్యతల నుంచి తప్పుకోవాలని అతను నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. అదే సమయంలో జట్టులో తనకు అప్పగించిన పాత్ర పట్ల అతను అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. అసిస్టెంట్ కోచ్‌గా దష్కటే ప్రధానంగా ఫీల్డింగ్ బాధ్యతలు చూడాలి. కానీ, హైదరాబాదీ టి. దిలీప్ రూపంలో జట్టులో ప్రత్యేక ఫీల్డింగ్ కోచ్ ఉండటంతో దష్కటే పాత్ర పరిమితమైంది. మరోవైపు ఫీల్డింగ్ కోచ్ దిలీప్ కూడా రాజీనామా చేస్తాడని వస్తున్న వార్తలను బోర్డు వర్గాలు ఖండించాయి. ద్రవిడ్ హయాం నుంచి ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్న దిలీప్ జట్టుతో కొనసాగుతాడని స్పష్టం చేశాయి.



Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609